www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక
బుధవారం 28 మే 2025
సంపుటి :07 సంచిక : 02 , పేజీలు : 12 వెల:రూ.5/-




## ఉభయ తెలుగు రాష్ట్రాలకు కొత్తజడ్జిలు

న్యూఢిల్లీ,మే27( వెలుతురు):
దేశంలోని వివిధ రాష్ట్రాల్లో11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుమలత తెలంగాణ హైకోర్టుకు, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం పేర్కొంది.

# ఉగ్రవాద ముల్లునే ఏరిపడేస్తాం

- 1947లో దేశాన్ని ముక్కలు చేసిన దగ్గరనుంచీ పాక్‌ది ఉగ్రబాటే
- పివోకే స్వాధీనంలో పటేల్ మాటలను లక్ష్యపెట్టని పాలకులు
- అదే ఇప్పటికీ మనలను వేధిస్తోంది
- గుజరాత్ పర్యటనలో ఎల్లెడలా దేశభక్తి కనిపించింది
- ఇది భారత్ ప్రజల హృదయాలను ఆవిష్కరించింది
- రెండోరోజు గుజరాత్ పర్యటనలో మోడీ





గాంధీనగర్,మే27( వెలుతురు):
భారత్ నుంచి ఉగ్రవాద ముల్లును ఏరేస్తామని ప్రధాని మోడీ చెప్పారు. గుజరాత్ పర్యటనలో భాగంగా రెండోరోజు మంగళవారం ప్రధాని మోడీ గాంధీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. తర్వాత మహాత్మా మందిర్‌లో రూ.5,536 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. మరోసారి పాకిస్తాన్‌ను లక్ష్యంగా చేసుకుని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం నుండి ఉగ్రవాద ముల్లును తొలగించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. నేను గత రెండు రోజులుగా గుజరాత్‌లో ఉన్నాను. నిన్న వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్.. ఈరోజు గాంధీనగర్‌ను సందర్శించాను. నేను ఎక్కడికి వెళ్ళినా.. అది కాషాయ సముద్రం గర్జించే శబ్దంలాగా, దేశభక్తి తరంగంలా అనిపించింది. కాషాయ సముద్రం గర్జన, రెపరెపలాడే త్రివర్ణ పతాకం, ప్రతి హృదయంలో మాతృభూమి పట్ల అపారమైన ప్రేమను చూపించింది. ఇది చూడటానికి మరపురాని దృశ్యం అని ఆయన అన్నారు. 1947 లో దేశం మూడు భాగాలుగా విభజించబడింది. ఆ రాత్రినే, కాశ్మీర్‌లో మొదటి ఉగ్రవాద దాడి జరిగింది. మన దేశంలో కొంత భాగాన్ని ముజాహిదీన్ పేరుతో ఉగ్రవాదులను ఉపయోగించి పాకిస్తాన్ స్వాధీనం చేసుకుంది. ఆ రోజున, మనకు పిఓకె వచ్చే వరకు మన సాయుధ దళాలు



## వన మహోత్సవం సామాజిక ఉద్యమంగా నిర్వహించాలి

- ఫారెస్టు తదితర శాఖలతో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ రివ్యూ
- గత అనుభవాల ఆధారంగా పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశం

హైదరాబాద్ వెలుతురు మే 27:
2025 సంవత్సర వన మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతున్నది... ఈ ఏడాది అందుకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో

## 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,మే27( వెలుతురు):
రాజీవ్ యువవికాసంపై తెలంగాణ డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు- భట్టి విక్రమార్క వెల్లడించారు. జూన్ 15 తర్వాత రాజీవ్ యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఉంటుందని, అక్టోబర్ 2 నాటికి 5లక్షల



## కాళేశ్వరం కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరు?



హైదరాబాద్, మే27(వెలుతురు):
కాళేశ్వరం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జూన్ 5వ తేదీన పీసీ ఘోష్ కమిషన్

## భూభారతి పేద రైతులకు చుట్టం

- ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి
- జూన్ 3 నుంచి 20 వరకు మూడోదశ రెవెన్యూ సదస్సులు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వాడాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

ధాన్యం కొనుగోళ్లలో దుష్ప్రచారాలను ఎండగట్టాలి

మంత్రులు, అధికారులతోసిఎం రేవంత్ వీడియోకాన్ఫరున్స్





హైదరాబాద్,మే27( వెలుతురు):
భూభారతి పేద రైతులకు చుట్టమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు హాజరయ్యారు. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై ఈ సమీక్షలో చర్చించారు.ఇందిరమ్మ ఇళ్లకు మేస్త్రీ ఛార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలని సిఎం అన్నారు. మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలని పేర్కొన్నారు. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలని తెలిపారు. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు ఇవ్వాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వాడాలని సూచించారు. 29, 30 తేదీల్లో ఇన్‌ఛార్జ్ మంత్రులు జిల్లాల్లో

## మోడీ హయాంలో దేశం ఆర్థికంగా బలోపేతం

- ఎకానమిలో నాలుగో స్థానంలో భారత్
- అంజయ్యకు జరిగిన అవమానే..రేవంత్‌కు జరిగింది
- సిఎం రేవంత్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వని రాహుల్
- ఆపరేషన్ సిందూర్, ఆర్మీని అవమానిస్తే ప్రజలు సహించరు
- మోడీ 11 ఏళ్ల పాలనను చూసి తట్టుకోలేక పోతున్న ఖర్గే
- బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్



హైదరాబాద్, మే27(వెలుతురు):
మోదీ పాలనలో న్యాయవ్యవస్థ బలోపేతం అయిందని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎకానమీలో పదోస్థానంలో ఉండేదని.. మోదీ పాలనలో 4వ అతిపెద్ద ఎకానమీ దేశంగా ఎదిగిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయిందని.. అయినా ప్రధానిగా మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడమనేది తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానంగా చూడాలని లక్ష్మణ్ తెలిపారు. గతంలో అంజయ్యకు అవమానం జరిగిందని..ఇప్పుడు రేవంత్‌రెడ్డికి జరుగుతుందని లక్ష్మణ్ గుర్తుచేశారు. మంగళవారం

## తెలంగాణలో విస్తరిస్తున్న నైరుతి

- నైరుతికి తోడు బంగాళాఖాతంలో ఆవర్తనం
- పలు జిల్లాల్లో జోరు వానలు
- వేములవాడ జలమయం
- హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన



హైదరాబాద్,మే27( వెలుతురు):
నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణలోకి విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ కారణంగా రేపు, ఎల్లుండి తెలంగాణలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గంటకు 40-50 కి.మీ వేగంతో

## ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల పట్ల వివక్ష

- ఉన్నత పోస్టుల భర్తీలో మోడీ నిర్లక్ష్యం: రాహుల్

న్యూఢిల్లీ,మే27( వెలుతురు):
ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాల వారి పట్ల మోడీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబిసి తరగతుల చెందిన వారి పట్ల



## శిల్పారామంలో ఆఫ్రికన్ల సందడి

- ఆకట్టుకున్న తెలంగాణ కళా రూపాలు

హైదరాబాద్,మే27( వెలుతురు):
ఆఫ్రికన్ ప్రతినిధులను సాంస్కృతిక ప్రదర్శనలు



## మహానాడు పేరు అంటేనే తెలుగుదేశం

- ఈ వేడుక విజయవంతం కావాలి
- ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపిన పవన్ కళ్యాణ్

అమరావతి,మే27( వెలుతురు):
తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మహానాడు... ఈ పదం విన్నా, చదివినా వెంటనే గుర్తుకు వచ్చేది 'తెలుగుదేశం' పార్టీనే అని..



## పేదలకు అండగా నిలిచింది తెలుగుదేశమే

- తెలుగు జాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ టిడిపి
- భవిష్యత్తు కోసం ఆరు శాసనాలను ప్రతిపాదించిన లోకేశ్




కడప,మే27( వెలుతురు):
పేదలకు కడుపు నిండా భోజనం పెట్టిన పార్టీ తెలుగుదేశం అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. కడపలో నిర్వహించిన మహానాడులో ఆయన మాట్లాడారు. తెలుగు జాతి కోసం పుట్టిన

## అక్రమార్కులను కఠినంగా శిక్షిస్తాం

- నేరస్థులు ఎక్కడున్నా వదిలి పెట్టం
- ఆసల్యమైనా శిక్ష నుంచి తప్పించుకోలేరు
- మహిళా సాధికారతకుప్రత్యేక కృషి
- నిజాయితీ రాజకీయాలే తెలుగుదేశం ఆస్తి
- ఏపార్టీలో అయినా టిడిపి వర్సిటీ విద్యార్థులే
- మహానాడు వేదికగా ఘాటు హెచ్చరికచేసిన చంద్రబాబు

కడప,మే27( వెలుతురు):
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అక్రమార్కులను శిక్షించే బాధ్యత ప్రజలు మనకు ఇచ్చారని, తప్పు చేసిన వారిని ఉపేక్షించేదే లేదని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఏపీలో నేరస్తులకు చోటు లేదని, ఎవరు అవినీతి చేసినా మొత్తం కక్కిస్తామన్నారు. నేరస్తులు



వెలుతురు

(మొదటి పేజీ తరువాయి..)

## వన మహోత్సవం సామాజిక ఉద్యమంగా నిర్వహించాలి



సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, ఎంఏయూడీ సెక్రటరీ టీ కే శ్రీదేవి, ప్రియాంక వర్గీస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అటవీ, ఇతర శాఖ అధికారుల ఆధ్వర్యంలో జూన్ మొదటి వారం నుండి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్న లక్ష్యంతో అధికారులు సిద్ధం చేసిన పీపీటీని మంత్రి సురేఖకి వీక్షించారు. అనంతరం సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.... అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని మంత్రి సురేఖ ఆదేశించారు. జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. 2024 సంవత్సరం డిపార్టుమెంటువారీగా, డిస్టిక్ వారీగా రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా... 19.04 కోట్లు నాటినట్టు మంత్రి సురేఖ గుర్తు చేశారు. 95 శాతం మేరకు అంచనాలు రీచ్ అయినట్టు వెల్లడించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో ఎదురైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్రత్తలను అధికారులు తీసుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్దంగా ఉండాలన్నారు. ఇండ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. గతం కంటే ఈసారి మాన్ సూన్ ముందే వచ్చిందని... ఈ నేపథ్యంలో అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఏరియాలో ఎటువంటి చెట్లు నాటాలో గుర్తించి ఆ విధంగా ముందుకు వెళ్ళాలని మంత్రి సూచించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపు ఇవ్వాలన్నారు. వనజీవి రామయ్య వంటి మహనీయుల కుటుంబీకులను సన్మానం చేయాలని మంత్రి సురేఖ అభిప్రాయపడ్డారు.

## 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు

మందికి దశలవారీగా లబ్ధి చేకూరేలా ప్రణాళిక వేసినట్లు- తెలిపారు. తొలి విడతలో రూ.లక్షలోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు- మంత్రి సీతక్క తెలిపారు. ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని వెల్లడించారు. రూ. లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు- తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా రేవంత్ ప్రభుత్వం ఎంపి-కై-న లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు- ప్రకటించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే.. మరో వైపు స్వయం ఉపాది అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. మొదటి విడతలో రూ. లక్ష లోపు యునిట్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తోందని, బడుగు బలహీన వర్గాలు, పేద యవత జీవితాల్లో రాజీవ్ యువ వికాసం వెలుగులు నింపనుందని వ్యాఖ్యానించారు.ద

## కాళేశ్వరం కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరు?

ముందు కేసీఆర్ విచారణకు హాజరు కావాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. గులాబీ బాస్ కి కాళేశ్వరం మిషన్ నోటీసులు ఇచ్చినప్పటికీ నుంచి పార్టీలో కమిషన్ ముందు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది.. కానీ, చివరకు వచ్చే నెల 5న విచారణకు వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నారు కేసీఆర్. మరోవైపు, జూన్ 6న ఈ-టె-ల రాజేందర్, చివరగా జూన్ 9వ తేదీన హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పీసీ ఘోష్ కమిషన్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పా-టైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా తుది దశకు చేరుకుంది. అయితే, ప్రాజెక్టు నిర్మాణం జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ఈ-టె-ల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీ-సులు అందజేసింది.

## ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల పట్ల వివక్ష

మోడీ ప్రభుత్వం చూపుతున్న వివక్షను వ్యవస్థాగత వివక్షగా రాహుల్ అభివర్ణించారు. ఈ తరగతులకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులను ఎన్‌ఎఫ్‌ఎస్ (నాట్ ఫౌండ్ సూటబుల్) అని తిరస్కరిస్తున్నారు. ఇది మనువాదం యొక్క కొత్త రూపం అని రాహుల్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, ఓబిసి తరగతులకు చెందిన అభ్యర్థులను నాయకత్వ పాత్రల నుండి మినహాయించడానికి కేంద్రం ఉద్దేశపూర్వకంగానే వారిని అనర్హులుగా మార్చేస్తుంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 60 శాతం రిజర్వ్‌డు ప్రొఫెసర్ పోస్టులు, 30 శాతం అసోసియేట్ ప్రొఫెసర్ పదవులు ఖాళీగా ఉన్నాయి. సమానత్వానికి విద్య ఒక సాధనం అనే బిఆర్ అంబేద్కర్ దృక్పథాన్ని మోడీ ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు చెందిన వారిని ఉద్దేశపూర్వకంగానే 'నాట్ ఫౌండ్ సూటబుల్' అని తిరస్కరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈవిధమైన చర్యలతో రాజ్యాంగంపై దాడి చేస్తోంది. సామాజిక న్యాయ ద్రోహానికి పాల్పడుతోంది. ఐఐటిలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు ఇలా అన్నిచోట్ల వీరిపై కుట్ర జరుగుతోంది. వీరు చేసే పోరాటం విద్య కోసమో, ఉపాధి కోసమో చేసే పోరాటం కాదు. ఇది హక్కులు, గౌరవం, భాగస్వామ్యం కోసం చేసే పోరాటమని' అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. తాను ఢిల్లీ యూనివర్సిటీ- స్టూడెంట్ యూనియన్ (డియుఎస్‌యు) విద్యార్థులతో మాట్లాడానని.. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు అమలు చేస్తున్న రిజర్వేషన్లకు వ్యతిరేక చర్యపై పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

## శిల్పారామంలో ఆఫ్రికన్ల సందడి

విశేషంగా అలరించాయి. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 5 రోజుల పర్యటన లో భాగంగా ఆఫ్రికా ఖండంలో మధ్య, పశ్చిమ ప్రాంతాల్లోని 15 దేశాలకు చెందిన 30 మంది ఆఫ్రికన్ ప్రతినిధులు హైదరాబాద్ పర్యటన లో భాగంగా మంగళవారం శిల్పారామం ను సందర్శించారు. ఒగ్గు డోలు బృందంతో అధికారులు ఆఫ్రికన్ ప్రతినిధులు కు స్వాగతం పలికారు. అనంతరం శిల్పారామం లో తెలంగాణ కళా రూపాలను ఆఫ్రికన్ ప్రతినిధులకు ప్రదర్శించారు. కూచిపూడి, ఒగ్గుడోలు, పేరిణి నృత్యాల ను ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శనలకు మైమరిచిపోయిన డెలిగేట్ లు కళాకారులతో కలిసి నృత్యం చేసారు. స్టాల్ లను సందర్శించారు. అంతకుముందు ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్ రంగంలో నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నగరంలో ఏర్పాటు చేసిన టి -వర్క్ ను సందర్శించి నూతన ఆవిష్కరణ లు తిలకించారు. మైండ్ స్పేస్ లోని హార్న్ బిల్ స్టూడియో ను సందర్శించారు. పిల్లలను ఆకట్టుకునే కార్టూన్, సినిమాలకు గ్రాఫిక్స్ రూపకల్పన పై నిర్వాహకులు ఆఫ్రికన్ డెలిగేట్ లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా హనుమాన్ సినిమాకు హార్న్ బిల్ సంస్థ అందించిన విజువల్స్ ఎఫెక్ట్ ను తిలకించి చప్పట్లతో నిర్వాహకులను అభినందించారు. ఆఫ్రికన్ కంటెంట్ క్రియేటర్ ల హైదరాబాద్ పర్యటన కార్యక్రమాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సమన్వయం చేస్తుంది.

# ఉగ్రవాద ముల్లునే ఏరిపడేస్తాం

ఆగకూడదని సర్దార్ పటేల్ చెప్పినా.. ఎవరూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు మనం గత 75 సంవత్సరాలుగా ఈ ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాం. పహల్గామ్ కూడా దానికి ఒక ఉదాహరణ. పాకిస్తాన్‌తో యుద్ధాలు జరిగినప్పుడు, మేము పాకిస్తాన్‌ను మూడుసార్లు ఓడించాం అని మోడీ చెప్పారు. ఒక శరీరం ఎంత బలంగా ఉన్నా, ఒక ముల్లు గుచ్చుకుంటే అంతా నొప్పిగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పాకిస్థాన్ మద్దతుతో దేశంలోకి ప్రవేశిస్తున్న ఉగ్రవాదమే ఆ ముల్లు అని, దాన్ని తొలగించాల్సిన సమయం వచ్చిందని ఆయన గుర్తు చేశారు. దేశ భద్రత, అభివృద్ధి, సంస్కృతి, జాతీయ గౌరవం గురించి మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని ప్రతి మూలలో దేశభక్తిని చూశానని, ఇది కేవలం గుజరాత్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. ప్రతి భారతీయుడి హృదయంలో ఉందని మోదీ పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో రెండో రోజు వడోదర, దాహోద్, భుజ్, అహ్మదాబాద్ వంటి ప్రాంతాలను సందర్శించిన తర్వాత మోదీ గాంధీనగర్‌లో పలు కార్యక్రమాలను ప్రారంభించారు. 1947 విభజన తర్వాత మొదలైన ఉగ్రవాద దాడులను గుర్తు చేసిన ఆయన, ఆ రోజు ముజాహిదీన్‌ను అంతమొందించి, సర్దార్ పటేల్ సలహాను పాటించి ఉండి ఉంటే, ఈ 75 ఏళ్ల ఉగ్రవాద చక్రం మనకు కనిపించేది కాదన్నారు. పాకిస్థాన్ ఇప్పటికీ ఉగ్రవాదాన్ని ఒక పరోక్ష యుద్ధంగా వినియోగించుకుంటోందని, కానీ అది నిజానికి ఒక వ్యూహాత్మకమైన యుద్ధమేనన్నారు ప్రధాని మోదీ. ఇటీవలి కాలంలో జరిగిన భారత ఉగ్రవాద వ్యతిరేక చర్యల గురించి కూడా ప్రధాని వివరించారు. 22 నిమిషాల్లో భారత్ 9 పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఇది కెమెరాల ముందే జరిగింది. ఇక రుజువుల కోసం ఎవరిని అడగాల్సిన అవసరం లేదు. శవపేటికలపై పాక్ జెండాలు పెట్టి, వారికి సెల్యూట్ చేయడం ద్వారా, వారు ఉగ్రవాదాన్ని తమ అధికారిక విధానంగా చెప్పుకున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా ప్రధాని మోదీ, దేశ భద్రతపై మౌనంగా ఉండకుండా, ధైర్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. 2014 మే 26న నేను ప్రధాని పదవిని స్వీకరించాను. అప్పటి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో 11వ స్థానం. కానీ ప్రస్తుతం అది నాలుగో స్థానానికి చేరిందని మోదీ గుర్తు చేశారు. ప్రపంచమంతా కరోనా, ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక సంక్షోభాలు వంటి సవాళ్లను ఎదుర్కుంటున్నప్పటికీ భారతదేశం తన గమ్యాన్ని వదులుకోలేదని ఆయన అన్నారు. మన లక్ష్యం 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్. స్వాతంత్ర్యం పొందిన 100 సంవత్సరాల సందర్భంగా, మన దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. శాంతియుత సహజీవనం భారత్ లక్ష్యమని, కానీ, ఆ శాంతిని సవాలు చేస్తే, భారతదేశం తక్షణమే స్పందిస్తుందని, ఇది వీరుల భూమి అని మోదీ వెల్లడించారు.

## తెలంగాణలో విస్తరిస్తున్న నైరుతి

ఈదురుగాలులు వీస్తాయి. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాబోవు రెండు, మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున పాత భవనాలు, చెట్ల కింద ఉండకూడదని హెచ్చరిస్తున్నారు. పొలాలకు వెళ్లే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి. ఇక, హైదరాబాద్ నగరంలో సాయంత్రం 7.30 గంటలకి వాన ప్రారంభమైంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, టోలిచౌకి, ఫిలింనగర్, మణికొండ, గచ్చిబౌలి, మియాపూర్, లింగంపల్లి, పటాన్ చెరు, ఆర్సీపురం, బీరంగూడ, సికింద్రాబాద్, మలక్ పేట్, దిల్ సుఖ్ నగర్, ఆరాంఘర్, పంజాగుట్ట, చిలకలగూడ, కుత్బుల్లాపూర్, షాపూర్, సూరారం, దుండిగల్, కొండాపూర్, పాటీ-÷-నతో పాటు- పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. అయితే, వర్షం నీరు రోడ్డుపై చేరడంతో పలు చోట్ల భారీగా ట్రాఫిక్ అయింది. ఐటీ- సెక్టార్ ఏరియాలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఆదిలాబాద్, రాజన్నసిరిసిల్ల, మహబూబాబాద్, జగిత్యాల జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. రానున్న రెండురోజులు కూడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడొచ్చిన ఐఎండీ తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. కొన్ని చోట్లు- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండలో అల్లాడిపోయిన ప్రజలకు సాయంత్రానికి కొంత ఉపశమనం కలిగింది. వరంగల్ జిల్లాల్లో కూడా వర్షం కురిసింది. వరంగల్ సిటీ-, హనుమకొండ తోపాటు- వరంగల్ రూరల్ చుట్టు- పక్కల ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నర్సంపేట డివిజన్ లోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన సాధారణ వర్షం కురిసింది. తొలకరి వర్షాలతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. మరోవైపు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ, నేరడిగొండ, గడియత్నూర్ బజార్, సిరికొండ మండల్లాలో భారీవర్షం కురిసింది. భారీవర్షాలతో వాగులు వంకలు పొంగిపొర్లి ప్రవహించాయి. రాజన్న సిరిసిల్లా జిల్లాలో కూడా వానలు పడ్డాయి. వేముల వాడలలో దాదాపు రెండు గంటలపాటు- వర్షం దంచికొట్టింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. 16 వవార్డు నీటమునిగింది.. దీంతో భక్తులకు చెందిన కారు, ఆటో పూర్తిగా వరదలో చిక్కుకుంది. భారీ వర్షాలతో వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట నక్క వాగు భారీగా వరద నీరు చేరడంతో పొంగిపొర్లుతోంది. ఇక మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, మహబూబాబాద్, కొత్తగూడ మండలాల్లో ఉరుములు , మెరుపులతో కూడిన వాన పడింది. జగిత్యాల జిల్లాలో కూడా మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొడిమ్యాల, కొండగట్టు- పరిసర ప్రాంతాల్లో ఉరుములు , మెరుపులతో భారీవర్షం అతలాకుతలం చేసింది. సుమారు రెండు గంటల పాటు- దంచికొట్టింది. దీంతో కొండగట్టు-లో భక్తులు ఇబ్బంది పడ్డారు. కొడిమ్యాల మండల కేంద్రం నుంచి సూరంపేటకు వెళ్లే దారిలో దమ్మాయిపేట స్టేజి వద్దగల పోతారం వాగు పొంగిపొర్లింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సూరంపేట - గంగారం తండాల మధ్య ఉండే పోతు చెరువు నుండి పెద్ద ఎత్తున నీటి ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రాంతంలో కట్ట మరమ్మత్తు పనులు పూర్తి కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజల ఆందోళన వ్యక్తం చేశారు.

## భూభారతి పేద రైతులకు చుట్టం

పర్యటించాలని ఆదేశించారు.ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందిస్తున్నానన్నారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు- చెల్లించాం.. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయి.. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేశారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి.. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టండి.. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.. జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియనించుకోండి.. భూభారతి పేద రైతులకు చుట్టం.. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలి.. భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయండి.. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకం.. క్షేత్రస్థాయిలో బాగా జరగాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉంది.. మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ- వేయాలి.. మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి.. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి.. ఇటు-క తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటు-కు రుణాలు అందించండి..29, 30 తేదీల్లో జిల్లాల.. ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలి.. జూన్ 1 నాటికి పూర్తి నివేదిక అందించాలి.. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని అన్నారు.

## మోడీ హయాంలో దేశం ఆర్థికంగా బలోపేతం

హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఎంపి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు ఆయుధాలు వదిలి జనజీవన ప్రవంతిలో కలిస్తే చర్చలు ఉంటాయని స్పష్టం చేశారు. కొంతమంది ఆపరేషన్ సిందూర్‌ను, ఆర్మీని అవమానించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాసిందని తెలుస్తోందని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఈటల రాజేందర్ నోటీసులకు సమాధానం ఇస్తారని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు. మల్లికార్జున ఖర్గే 11 ఏళ్ల మోదీ పాలనను పీడకలగా చెప్పడం సరికాదని అన్నారు. ఎమర్జెన్సీని తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అది ఓ పీడకల అని విమర్శించారు. ఓబీసీ రిజర్వేషన్‌ను అడుగు అడుగునా అడ్డుకుంది ప్రతిపక్షనేత రాహుల్ గాంధీనే అని విమర్శించారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో చేయలేనిది మోదీ 11 ఏళ్లలో చేశారని అన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో దేశం అగ్రస్థానంలో ఉందని లక్ష్మణ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ రూ. 50లక్షల కోట్లలో.. కేవలం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ. 11లక్షల కోట్లను మోదీ కేటాయించారని లక్ష్మణ్ స్పష్టం చేశారు. మోదీ హయాంలో దేశం వందశాతం అభివృద్ధి చెందితే కాంగ్రెస్ హయాంలో 50శాతం కూడా అభివృద్ధి చెందలేదని విమర్శించారు. మోదీ హయాంలో 7.4శాతం జీడీపీ వృద్ధి చెందిందని గుర్తుచేశారు. అతి త్వరలోనే మూడో ఆర్థిక దేశంగా భారతదేశం అవతరించపోతుందని ఉద్ఘాటించారు. ఇప్పటి-కై-నా మల్లికార్జునఖర్గే ఆలోచించి మాట్లాడాలని లక్ష్మణ్ హితవు పలికారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పైనా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విషం చిమ్మారని లక్ష్మణ్ ఆరోపించారు. మీడియా స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇచ్చారు.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారు మోదీ.. దేశంలో అభివృద్ధి తారాస్థాయికి చేరుకుంటుందని గుర్తు చేశారు. కానీ, ఎమర్జెన్సీ పెట్టింది కాంగ్రెస్ అని మండిపడ్డారు. అయితే, ప్రపంచంలో నాల్గవ ఆర్థిక శక్తిగా భారత్ చేరుకుంది.. బీజేపీ, మోడీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతుందన్నారు. ఇక, పేదరికం అనుభవించిన వ్యక్తి మోడీ అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. మోడీనీ కులం పేరుతో రాహుల్ గాంధీ దూషించారు.. ఇక, రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే భయంకరమైన కలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. దేశంలో యువత ఉద్యోగాలు చేసే వారుగా కాకుండా.. ఉద్యోగాలు ఇచ్చే వారీగా తయారు చేస్తున్నారు మోడీ అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ట పెరుగుతుంటే.. మోడీనీ నాయకునిగా కీర్తిస్తుంటే గర్వకారణం కాదా అనేది ఖర్గే చెప్పాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అయితే, ఆపరేషన్ సింధూర్ లాంటి దాడులతో పాకిస్తాన్ కు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా చెశారా అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో భారత ప్రజలు లేరు.. రేవంత్ రెడ్డి మూడు రోజులు ఢిల్లీలో పడిగాపులు పడ్డారు.. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజలకు అవమానం.. గతంలో అంజయ్యకు కూడా అవమానం జరిగింది.. ఢిల్లీకి వెళ్ళి కలవడంలో తప్పులేదు.. కానీ, ఇలా పడిగాపులు పడడం తెలంగాణ ప్రజలకు అవమానం అని పేర్కొన్నారు. ఇక, బీజేపీ వెనుక రాజకీయాలు, వెన్నుపోటు రాజకీయాలు చేయదు.. ఏదైనా సరే ముందు నుంచే చేస్తుందని లక్ష్మణ్ చెప్పుకొచ్చారు.

## అక్రమార్కులను కఠినంగా శిక్షిస్తాం

ఎక్కడున్నా వదిలిపెట్టం అని, తప్పు చేసిన వారికి కాస్త ఆలస్యమైనా శిక్ష తప్పదని వార్నింగ్ ఇచ్చారు. వైసీపీ అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటం చేశాం అని.. అవినీతిపై పోరాటం చేస్తే ఇప్పుడు సీబీఐ విచారణ చేసే పరిస్థితి వచ్చిందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. మూడు రోజుల పాటు మహానాడులో సీఎం చంద్రబాబు మాట్లాడారు.ఈ రాష్ట్ర దశ దిశా మార్చే కార్యక్రమాలు చేపడతాం. తండ్రి ఆస్తిలో బాలికలకు హక్కు దగ్గర నుంచి డ్వాక్రా సంఘాల సాధికారత వరకు మహిళలకు పెద్దపీట వేశాం. రాజకీయ పాఠశాలలో నేను కూడా నిత్య విద్యార్థినే. నేను ఒక సైనికుడిని, నిరంతరం పోరాటం చేస్తా. మీరు, నేను కలిస్తే ఆకాశమే హద్దుగా పనిచేయ గలుగుతాం. తెలుగుదేశం పార్టీ నీతి నిజాయితీతో రాజకీయాలు చేస్తుంది. ప్రతిపక్షంలో అవినీతిపై పోరాటం చేశాం. ఆంధ్రప్రదేశ్లో ఉన్న ఏ పార్టీలో చూసినా టీడీపీ పార్టీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులే ఉన్నారు. కేంద్రంలో మన రాష్ట్ర పరపతి పెరిగింది. దేశంలోనే అన్ని పార్టీలు మనల్ని చూసి బీసీలను గుర్తించేలా వచ్చారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలలో టీడీపీ కీలక పాత్ర పోషించింది. కడపలో జరుగుతున్న ఈ మహానాడు ఒక చరిత్రను తిరగరాస్తుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. జల హారతి ద్వారా ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడం కోసమే నదులు అనుసంధానం చేపట్టాం. హైటెక్ సిటీతో హైదరాబాదులో ఆనాడు నేను ఐటీని ప్రారంభించాను. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాం. విజన్ ఆంధ్రతో 2047లో తీసుకొస్తాం. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీనే మన విధానం. 2047కు పేదరికం లేకుండా చేస్తాం. ఆర్థిక అసమానతలు తొలగించి అందరూ ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలన్నదే నా ధ్యేయం. అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తాం. టీ-డపీ అవినీతిపై పోరాటం చేస్తే ఇప్పుడు సీబీఐ విచారణ చేసే పరిస్థితి వచ్చింది. ఓబులాపురం అక్రమ మైనింగ్‌పై మనం చేసిన ఉద్యమం దేశవ్యాప్తంగా సంచలనం. వైసీపీ ప్రభుత్వంలో స్కామ్ లెక్కలు లెక్క పెడుతున్నాం. అక్రమార్కులను శిక్షించే బాధ్యత ప్రజలు మనకు ఇచ్చారు. తప్పు చేసిన వారిని



ఉపేక్షించేదే లేదు. ఏపీలో నేరస్తులకు చోటు లేదు, ఎవరు అవినీతి చేసినా మొత్తం కక్కిస్తాం. నేరస్తులు ఎక్కడున్నా వదిలిపెట్టం, తప్పు చేసిన వారికి కాస్త ఆలస్యమైనా శిక్ష తప్పదు' అని సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్నినిలబెడుతున్నాం. ప్రజల్లో అలజడి పోయింది, అశాంతి పోయింది. కూటమి ప్రభుత్వంతో మనశ్శాంతి వచ్చింది. 64 లక్షల మందికి పెన్షన్లు పెంచాం. దీపం పథకంతో కోటి మందికి లబ్ధి చేకూర్చాం. అర్చకులు, ఇమాములు, మౌజన్‌లకు గౌరవ వేతనాలు పెంచాం. పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని పెంచి పెట్టు-డులు తెస్తున్నాం. 76 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. 10 లక్షల కోట్లు- వారసత్వ అప్పు ఉంది. పాఠశాలలు ప్రారంభించే లోపు తల్లికి వందనం ఇస్తాం. రైతుకు న్యాయం చేయడానికి టీడీపీ సిద్ధంగా ఉంది. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తాం అని సీఎం చెప్పుకొచ్చారు.

## మదన్ లాల్ మృతికి మంత్రి పొంగులేటి సంతాపం

**హైదరాబాద్ వెలుతురు మే 27:**

వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ మృతి పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గతంలో వైసీపీ, బీఆర్ఎస్ లో ఉన్నపుడు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మదన్ లాల్ మృతి వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థించినట్లు తెలిపారు.

## మహానాడు పేరు అంటేనే తెలుగుదేశం



అంతలా తెలుగువారి గుండెల్లో స్థిరపడి పోయిందని ప్రతి ఏటా జరిగే మహానాడు వేడుక అని ఉద్ఘాటించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. రాయలసీమ గడ్డపై... కడపలో అంగరంగ వైభవంగా జరిగే మహానాడు చారిత్రక రాజకీయ పండుగ అని వెల్లడించారు. ఈ శుభవేళ తన పక్షాన, జనసేన పార్టీ పక్షాన తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌లకి పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న పల్లా శ్రీనివాస్, బక్కని నరసింహులకు శుభాభినందనలు తెలిపారు. ప్రజాసేవ, ప్రజా ప్రయోజనమే పరమావధిగా జరుగుతున్న ఈ మూడు రోజుల వేడుకలో చర్చించనున్న ఆరు అంశాలు ప్రశంసనీయంగా ఉన్నాయని కొనియాడారు. కార్యకర్తే అధినేత, యువగళం, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండ వంటి అంశాలపై ఈ మహానాడులో చర్చించి అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించడం అభినందనీయమని ప్రశంసించారు. పసుపు వర్ణంతో ముస్తాబైన మహానాడు ప్రాంగణం శోభాయమానంగా కనువిందు చేస్తోందని అన్నారు. ఈ వేడుక విజయవంతంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## పేదలకు అండగా నిలిచింది తెలుగుదేశమే

ఏకైక పార్టీ తెదేపా అని అన్నారు. మనకు ప్రతిపక్షం కొత్తకాదు.. అధికారం కొత్త కాదు. భవిష్యత్తు కోసం ఆరు శాసనాలను ప్రతిపాదిస్తున్నా. అవి 1. తెలుగుజాతి విశ్వఖ్యాతి, 2. యువగళం, 3. స్త్రీశక్తి, 4. పేదల సేవల్లో సోషల్ రీఇంజినీరింగ్, 5. అన్నదాతకు అండగా, 6. కార్యకర్తలే అధినేత. అన్ని రంగాల్లో మన తెలుగువారు ప్రపంచంలోనే ముందుండాలి. పని చేసేవారిని ప్రోత్సహిస్తాం.ఎత్తిన పసుపు జెండా దించకుండా కార్యకర్తలు పార్టీకి కాపలా కాశారు. అందుకు ప్రతి కార్యకర్తకు శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నానని అన్నారు. . ఎన్టీఆర్.. పార్టీ పెట్టిన ముహూర్త బలం చాలా గట్టిది. తెలుగు వాళ్లు ఎక్కడ ఇబ్బంది పడినా స్పందించేది మన పార్టీనే. ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ఎప్పటికప్పుడు నేతలు, కార్యకర్తలు కష్టపడాల్సిందే. ప్రణాళికలు సిద్ధం చేసి.. మహానాడులో చర్చించి నిర్ణయాలు తీసుకుందాం. తెలుగువారి ఆత్మగౌరవం పార్టీ సిద్ధాంతం అని లోకేశ్ తెలిపారు. పేదరికం లేని సమాజం టీడీపీ లక్ష్యం అని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో కూడా మార్పు రావాలని, మహానాడు వేదికగా మరో 40 సంవత్సరాలు పార్టీ నడపడానికి కావలసిన అంశాలపై చర్చించాలన్నారు. 58 మంది మొదటిసారిగా గెలిచిన ఎమ్మెల్యేలు ఉన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మంది కొత్త ఉపాధ్యాయులు రాబోతున్నారు. గత ప్రభుత్వంలో అసెంబ్లీ సాక్షిగా తల్లులను అవమానించారు. సొంత తల్లి చెల్లిని మెడపెట్టి గెంటేశారు. అర్థమైందా రాజా అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. టీడీపీకి ప్రతిపక్షం కొత్తకాదు.. అధికారం కొత్తకాదు' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తు కోసం ఆరు శాసనాలను ప్రతిపాదిస్తున్నా అని మంత్రి తెలిపారు.

## సినిమా హాళ్లలో రేట్లు దారికి రావాల్సిందే

**●పవన్ కళ్యాణ్య వ్యాఖ్యలను స్వాగతించిన దిల్‌రాజు**

**హైదరాబాద్,మే27( వెలుతురు):**



సగటు సినిమా ప్రేక్షకులను థియేటర్లకు తీసుకురావడం అనే అంశం పై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని దిల్ రాజు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలను అందరికీ అందుబాటులోకి తేవాలన్న పవన్ అభిప్రాయం అభినందనీయం. దీనిని మనమందరం స్వాగతించి, కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని అన్నారు. అలాగే, థియేటర్ల నుంచి ఓటీ–టీ– ఎ÷–లాట్ ఫామ్ కి సినిమాలు త్వరగా వెళ్తుండటంతో ప్రేక్షకులు ఓటీటీ వైపు మొగ్గు చూపుతున్నారు. కాబట్టి, ఒక సినిమా ఎంత కాలానికి ఓటీటీకి వెళ్ళాలి అనే అంశంపై మనమందరం కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మనందరికీ ఉందని ఆయన సినీ వర్గాల వారిని అన్నారు. ప్రేక్షకుడికి వెండితెరపై సినిమా చూసే అనుభూతిని అర్థవంతంగా తెలియజేయడం మనందరి బాధ్యత, ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా కాకుండా ఫిలిం ఛాంబర్ ద్వారా మాత్రమే సంప్రదించాలనే సూచన పరిశ్రమకు శాశ్వత దిశ ఇస్తుంది. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమ ప్రభుత్వాలతో కలసి ముందుకు సాగాలి. ఈ దిశగా ముఖ్యమైన తొలి అడుగులు వేసిన గౌరవనీయులు పవన్ కళ్యాణ్ కి నా ప్రత్యేక కృతజ్ఞతలు అని ఆయన అన్నారు. థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడానికి మరో ముఖ్యమైన కారణం పైరసీ. మనమంతా కలిసికట్టుగా పైరసీపై పోరాడినప్పుడే, మన ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించగలగుతాము. అలాగే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచించిన అన్ని అంశాలపై తెలంగాణ ప్రభుత్వంతో కూడా సంప్రదింపులు జరిపి, మన తెలుగు సినిమా అభివృద్ధికి నిర్మాతల మండలి కలిసికట్టు–గా తోడ్పడుతాం అంటూ దిల్ రాజు పేర్కొన్నారు.

## అవినీతిలో మునిగిన బిఆర్ఎస్ నేతలు

- **నీతులు పలికితే జనం నమ్మరు**
- **లీక్కర్ కవిత ఎవరికి నీతులు చెబుతారు**
- **మండిపడ్డ బిజెపి నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**

**హైదరాబాద్,మే27( వెలుతురు):**



బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచిన బీఆర్ఎస్ ఇప్పుడు నీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. లిక్కర్ కేసులో జైలు నుంచి వచ్చి కవిత ఎవరికి నీతి పాఠాలు చెబుతోందని అంటూ ప్రశ్నించారు. కుంభకోణాలకు సంబంధించి కేసీఆర్, కేటీఆర్‌లకు నోటీసులు వచ్చాయని, ఇవి రాజకీయ నోటీసులు కాకుండా అవినీతి ఆరోపణలపై విచారణ నోటీసులేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేతగా, ఎమ్మెల్యేగా విఫలమయ్యారు. కేటీఆర్ ఇప్పటికే అనేక విచారణలకు లోనవుతున్నారు. ఇదే సమయంలో హరీష్ రావు, కవిత వంటి నేతలు కూడా అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. అందుకే ఈ నేతలు తక్షణం తమ పదవులకు రాజీనామా చేయాలని అన్నారు. ఈటల రాజేందర్‌కు వచ్చిన నోటీసులపై పార్టీ స్థాయిలో చర్చించి తదుపరి కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఈటలపై విచారణ జరుగుతుంది. ఈ విచారణలో బీఆర్ఎస్ నేతల అవినీతి ఆరోపణలు బట్టబయలవుతాయని మేము ఆశిస్తున్నాం, అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. కవిత లేఖ బయటకు వచ్చిందన్నదే కాదు.. డీల్ బయటపడినందుకే వాళ్లకు భయం అంటూ బీఆర్ఎస్ నేతలను మరోసారి విమర్శించారు. నీతి ఆయోగ్ 10వ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు. అయితే 9వ సమావేశానికి హాజరుకాలేదని గుర్తుచేస్తూ, అప్పుడు ముఖ్యమంత్రి ఎవరినిమిత్తం, ఎందుకోసం గైర్హాజరయ్యారనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. నీతి ఆయోగ్ సమావేశాల ఉద్దేశం రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్న దానిపై కేంద్రం నమ్మకం పెట్టుకున్నదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ఫెడరల్ స్ఫూర్తితో సమావేశంలో పాల్గొనడం సానుకూల పరిణామం. కానీ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పాటించడం లేదు. కనీసం ఇప్పుడు అయినా వాటిని అమలు చేయాలని అధికార యంత్రాంగానికి సీఎం ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

## కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలు విజయవంతం కావటం చాలా సంతోషంగా ఉంది

- మంత్రి కొండా సురేఖ



తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత తొలి పుష్కరాలు అద్భుతంగా జరిగాయి. 30 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కాళేశ్వర ముక్తీశ్వరుడి దర్శనం చేసుకున్నారు. ఇందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు, స్థానిక ప్రజలకు, భక్తులకు ధన్యవాదాలు.

రాబోయే రోజుల్లో వచ్చే గోదావరి పుష్కరాలను మరింతగా గొప్పగా జరుపుకుందామని తెలియజేస్తున్న.

ఈ పుష్కరాలు విజయవంతం కావటంలో కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబు గారు, స్థానిక అధికారులు, ఎండోమెంట్ డిపార్టుమెంటు వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**హైదరాబాద్ వెలుతురు మే 27:**



కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్..

రాష్ట్రంలో పెండింగ్ అంశాలు, పలు సమస్యల విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

**న్యూఢిల్లీ వెలుతురు మే 27:**

## ఎసిబి పేరుతో బెదిరింపులు

- **కఠిన చర్యలు తీసుకుంటామన్న డైరెక్టర్**

**హైదరాబాద్,మే27( వెలుతురు):**

అవినీతి నిరోధకశాఖ అధికారులమని ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీబీ డైరెక్టర్ విజయ్ కుమార్ తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఈ మోసగాళ్లు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారని తెలిసిందని ఏసీబీ డైరెక్టర్ తెలిపారు. ఇలాంటి మోసాలు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఏసీబీ అధికారులు ఎవరూ కేసుల విషయంలో కానీ, ఇతర కారణాలతోనూ డబ్బులు డిమాండ్ చేయరని పేర్కొన్నారు. తాజాగా ఖమ్మం జిల్లాలోని టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ నకిలీ ఏసీబీ అధికారిపై కేసు నమోదైందని వెల్లడించారు. ఏసీబీ అధికారులుగా చెప్పుకొంటూ ఎవరైనా ఫోన్ చేస్తే ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే అప్రమత్తమై ఏసీబీ టోల్–ఫ్రీ నంబర్ 1064కు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డైరెక్టర్ హామీ ఇచ్చారు.



# సంపాదకీయం..

## కోట ఆత్మహత్యల రహస్యం ఛేదించేదెవరు?

విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాజస్థాన్ కోటలో నీట్ పరీక్షల కోచింగ్ వెళుతున్న విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నారు. తాజాగా కాశ్మీర్‌కు చెందిన ఓ అమ్మాయి బలవన్మరణం చెందింది. ఇటీవలే కోట ఆత్మహత్యలపై సుప్రీం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. కోటలోనే ఎందుకు ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నది భేతాళ కథల్లా మారింది. ఇప్పటి వరకు అక్కడ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో గుర్తించడం లేదు. గతంలో ఐఐటిల్ల వరుసగా ఆత్మహత్యలు కలవర పెట్టేవి. తరవాత మన తెలుగు రాష్ట్రాల్లో నారాయణ, చైతన్య కాలేజీల్లో చదువుకునే వారిలో ఆత్మహత్యలు కనిపించేవి. ఇప్పటికీ ఈ రెండు కాలేజీల్లో ఐఐట కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు అడపాదడపా ఆత్మహత్యలకు పాల్పడుతూనే ఉన్నారు. ఉన్నత విద్యావంతులు కావమెలా ఉన్నా అసలు ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థులతో తల్లిదండ్రులు గుండెశోకంతో తల్లడిల్లుతున్నారు.దేశంలో రాజస్థాన్ కోటా నీట్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చేందుకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా ప్రచారంలో ఉంది. ఇక్కడ కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయని అనేక మంది భావిస్తుంటారు. ఈ ప్రాంతంలో ఇటీవల కాలంలో కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్న తీరు ఆందోళన కలిగించేదిగా ఉంది. గతంలో ఇదే విషయంలో సుప్రీంకోర్టు సైతం అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించింది. ఈ సంవత్సరం కోటాలో జరిగిన 14 ఆత్మహత్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ విషయాన్ని తేలికగా తీసుకోకూడదని, తీవ్రంగా పరిగణించాలని కూడా చెప్పింది. ఈ విషయంలో కోటా ఎస్పీకి కూడా కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా మరో 18 ఏళ్ల విదార్థిని సూసైడ్ చేసుకుంది. జమ్మూ కశ్మీర్ నివాసి అయిన విద్యార్థిని జీషాన్ నీట్ కోసం ప్రిపేర్ అయ్యేందుకు నెల రోజుల క్రితం కోటాకు వచ్చారని మహావీర్ నగర్ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. ఆ విద్యార్థిని మహావీర్ నగర్ ప్రతాప్ కూడలి వెనుక అద్దె ఇంట్లో ఉండేది. ఈ క్రమంలోనే అద్దె ఇంట్లోని ఒక గదిలో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో పోలీసులు ఆ విద్యార్థిని గురించి, ఆమె పరిచయస్తులు, స్నేహితుల గురించి సమాచారాన్ని సేకరిస్తున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆ విద్యార్థిని చివరగా జమ్మూ కశ్మీర్‌లో బుర్హాన్ అనే వ్యక్తితో మాట్లాడుతున్నట్లు చెప్పారు. మాట్లాడుతూనే ఆ విద్యార్థిని తన గదికి వెళ్లిందన్నారు. ఆ క్రమంలో బుర్హాన్ తన ఫోన్ డిస్‌కనెక్ట్ చేసి, కోటాలో తనకు తెలిసిన ఒక అమ్మాయికి సమాచారం ఇచ్చి, జీషాన్ దగ్గరకు వెళ్ళమని అడిగినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ పరిచయస్థురాలైన అమ్మాయి ఆమె ఇంటికి చేరుకునేసరికి, గది గేటు లోపలి నుంచి మూసి ఉంది. ఆ తరువాత, సమీప ప్రాంతాల వారికి విషయం తెలిపి గది డోర్ కట్టర్‌తో కత్తిరించగా, విద్యార్థిని లోపల ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఆ సమయంలో ఆత్మహత్య చేసుకున్న గదిలో ఉరిని నిరోధించే ఫ్యాన్స్ లేవని పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో పోలీసులకు ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. ఈ ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కోటాలో ఫ్యాన్ సూసైడ్ మరణాలను నిరోధించేందుకు ఆ ప్రాంతాల్లోని హాస్టళ్లు సహా విద్యార్థులకు అద్దెకు ఇచ్చే గదుల్లో స్ప్రింగ్‌తో వేలాడే ఫ్యాన్లను అమర్చాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. వాటిని ఉపయోగించడం వల్ల ఫ్యాన్ సూసైడ్ మారణాలను అరికట్టవచ్చని తెలిపింది. కానీ ఈ విధానాన్ని అక్కడి వారు పాటించకపోవడం కూడా వారి మరణాలకు మరింత అవకాశాలు పెరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతోపాటు గతంలో నీట్ కోచింగ్ సమయంలో తక్కువ మార్కులు వచ్చిన వారిపై కూడా ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలు చేసుకున్న కేసులు వెలుగులోకి వచ్చాయి. అయితే ఒత్తిడి వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారా లేక మరేదైన కారణం ఉందా అన్నది అంతు చిక్కడం లేదు. ఈ దిశగా పోలీసులు కూడా పెద్దగా దర్యాప్తు చేపట్టడం లేదు. సుప్రీం ఆదేశాలతో కదులుతారా లేదా అన్నది కూడా అనుమానమే. ఇప్పటి విద్యార్థులకు పరీక్షలు వాటి ఫలితాలు జీవన్మరణ సమస్యలుగా మారాయి. నూటికి నూరు శాతం మార్కులు, అత్యుత్తమ ర్యాంకులు కొలబద్దలుగా నిలిచాయి. పోటీ ప్రపంచపు తూకపు రాళ్లలో ఒక్క గ్రాము అటు ఇటూ అయినా విద్యార్థులు బలవన్మరణా లకు పాల్పడుతున్నారు. కోటలోనే కాదు ఇంటర్, టెన్త్ ఫలితాలు తమకు అనుకూలంగా రాకున్నా విద్యార్థులు ఆత్మహత్యలకు తెగిస్తున్నారు. పరీక్షలో ఫెయిల్ కావడాన్ని తట్టుకోలేక పోతున్నారు. ఇకపోతే ఎపిలో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల తరువాత నలుగురు, ఇంటర్మీడియట్ ఫలితాల తరువాత ఇద్దరు ఆత్మహత్యలకు పాల్పడినట్లు వచ్చిన వార్తలే నిదర్శనం. వెలుగు చూడనివి ఇంకొన్ని ఉండవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక విద్యార్థి బలవన్మరణం పాలవుతున్నాడు. వీరిలో అత్యధికులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన వారేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ పోటీ ప్రపంచంలో విద్య, వైద్యం, గౌరవప్రదమైన జీవితం వంటి కనీస అవసరాలు సామాన్యులకు ఎండమావులుగా మారుతున్నాయి. వాటి కోసమే తల్లిదండ్రులు తమ చిన్నారులను పరీక్షల, ర్యాంకుల ఎడారుల్లో పరుగులు పెట్టిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పని చేసే టీచర్లు , అధ్యాపకులదీ ఇదే స్థితి. ఎప్పటికప్పుడు కొత్త ర్యాంకర్లను ఉత్పత్తి చేయకుంటే వేలాడుతున్న కత్తి వారి మెడమీద పడటం ఖాయం! ఈ భయోత్పాత స్థితే అభం, శుభం తెలియని పసిపిల్లలకు మరణశాసన మౌతోంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి ప్రభుత్వం పూనుకోవాలి. వాటిని ప్రాథమిక హక్కులుగా మార్చాలి. తమకు నచ్చిన అంశంపై విద్యార్థులు దృష్టి సారించాలి. పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. అందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్య! ఆ బాధ్యతను అవి నెరవేర్చకుంటే నిలదీయాలి. పోటీలు పడే విద్యను దూరం చేయాలి. మంచి వాతావరణంలో పాఠాలు నేర్పే ప్రయత్నాలు మొదలవ్వాలి. అప్పుడే విద్యారంగం బాగు పడుతుంది. అలాగే ఆత్మహత్యల నిరోధం తగ్గుతుంది. వారిలో ఆత్మస్థయిర్యం పెంచేలా బోధనలు సాగాలి. ర్యాంకులు రాకుంటే జీవితం లేదన్న భావన నుంచి బయటపడేయాలి.

## అమ్మ మము విడిచి పాతికెళ్లు అయ్యింది



నిజమా నిజంగా అన్ని ఏండ్లు అయ్యింది అంటే నమ్మలేని విషయం

నిత్యం పొద్దున్న లేచింది మొదలు ప్రతి మాటలో పిల్లల మారం
లో విత్ అవుట్ నాన్నమ్మ అనే మాట లేకుండా చర్చే లేదు

మీతో పిల్లలు ఆడుకున్న గుర్తులు లేవు కనీసం
చెప్పుకునే జ్ఞాపకాలు లేవు

అయినా అమ్మ నీ ప్రస్తావన లేకుండా రోజు
ముగియదు

మేము పెద్దవాళ్ళం అనే భావన లో పిల్లలను
బెదిరిస్తే మీ అమ్మ నాన్న ఇలాగే చేసారా
అంటూ వాళ్ళేదో రోజు మీతో కలిసి మెలసి
ఉన్నట్లు పోజు కొట్టి మేము గడిపిన రోజులనే మై
మరిపిస్తున్నారు

ఇంతా గుర్తు చేసుకునే పిల్లలను చూసి మీరూ తొందర పడి
ఉంటారు అని అనిపిస్తుంది.

మేమూ మీకు పిల్లలు గా ఉన్నపుడు మీమ్మల్ని సతాయించిన సందర్భాలు

అప్పటికి మేమెదో పెద్ద మేధావులు ఫోజు కొట్టిన సందర్భాలు అన్ని ఇపుడు
మీ వారసుల మాటలు వింటే మేము మిమ్మలని ఎంత భడపెట్టమో అర్ధం
అవుతుంది



మీరు దూరం అయినా సరే నిత్యం మీ స్మరణ లేకుండా
పోద్దు పోదు అంటే నమ్మాలి

అందుకే మీరు దూరం అయ్యారని బాధ పాడాలో అప్పుడే
తొందరా పడి వెళ్ళిపోయారు అని మీ పై కొప్పడాలో అర్ధం
కావడం లేదు

అయినా పిల్లల మాటల్లో నిత్యం జీవిస్తున్న మీకు ఇవే మా నివాళులు



(నేడు మా అమ్మ కలుకూరి వెంకటమ్మ
25 వ వర్ధంతి సందర్భంగా అమ్మ జ్ఞాపకం)

-రాజు కలుకూరి

# ఎన్టీఆర్ ఓ రాజకీయ సంచలనం

- భారత రాజకీయాల్లో చెరగని ముద్ర
- ఎన్టీఆర్ చరిత్ర భవిష్యత్ తరాలకు ఆదర్శం

విజయవాడ,మే27( వెలుతురు):

భారత రాజకీయాల్లో చిరస్మరణీయమైన పాత్ర పోషించిన దురంధురడు దివంగత నందమూరి తరాకరామావు. ఉమ్మడి ఎపిలో రాజీయ పార్టీ పెట్టి అద్భుతమైన పాలనతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అజరామరుడు ఎన్టీఆర్. ఆయన ఓ వ్యక్తి కాదు శక్తి.. ఆయన ఓ సాహస శక్తి. ఆయనొక సంచలనం, తెలుగువాడి విశ్వరూపం. ఆయన ఆత్మగౌరవ నినాదం తెలుగుజాతి గుండెల్లో నేటికీ మారుమోగుతూనే ఉంది. మనం ఎక్కడ పుట్టాం, ఎలా పుట్టామన్నది ముఖ్యం కాదు. ఆ ప్రాంతానికి, ఆ జాతికి ఏం చేశాం, వారిలో ఎంత స్ఫూర్తిని నింపామన్నది ముఖ్యం. అలాంటి కారణ జన్ముడు, యుగపురుషుడు ఎన్టీఆర్. జీవితాంతం అలానే నడిచి, నడిపించి రాజకీయాలను కొత్త మలుపు తిప్పిన అపర మేధావి. ఎన్టీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అది జనహితమే... అదో సంచలనం. ఐదు దశాబ్దాలు సినీ, రాజకీయ, సామాజిక రంగాల్లో తెలుగువారి ఆశలను, ఆశయాలను బాగా ప్రభావితం చేశారు. రాజకీయ, సినీరంగంపైనే కాదు.. యావత్ తెలుగు నేలపై ఎన్టీఆర్ పేరు చెరగని సంతకం అని చెప్పక తప్పదు. ఆయన రాజకీయంగా వేసిన ప్రతి అడుగూ ఓ సంచనలమే. పేదలకు పట్టెడన్నం పెట్టాలని తీసుకున్న నిర్ణయమే కిలో రెండు రూపాయల బియ్యం. అయితే ఎంతగా ఆయన పేదల కోసం పనిచేశారో.. అంతగా సొంత మనుషుల చేతిలో దగాపడ్డారు. అల్లుడు చంద్రబాబే ఆయనకు వెన్నుపోటు పొడిచారు. అధికారాన్ని లాగేసుకున్నారు. అందుకు ఆయన తనయులను పావులుగా వాడుకున్నారు. దానికి అధికార మార్పిడి అన్న ముసుగేశారు. ఎన్టీఆర్ రాజకీయరంగ ప్రవేశం చేసే నాటికి రాష్ట్రంలో రాజకీయ శూన్యత, అస్థిరత్వం నెలకొని ఉన్నాయి. తెలుగు జాతికి, భాషకు గుర్తింపు లేకుండా పోయింది. ఆనాటి ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఏడాదికి నలుగురు ముఖ్యమంత్రులను మారుస్తూ తెలుగువాడి ఆత్మగౌరవాన్ని హస్తినాపురంలో అణాపైసలకు అమ్మకానికి పెట్టారు. ఆ నేపథ్యంలో 1982 మార్చి 29న న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీని ప్రకటించారు. తెలుగుజాతి ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రజాసంక్షేమం అనే సిద్ధాంతాలపై తెలుగుదేశం పార్టీ నిర్మితమైంది. 9 నెలల పాటు అవిశ్రాంతంగా పల్లెలు, పట్టణాలు, నగరాలు కలియ తిరిగారు. జనం మైళ్లకు మైళ్లు నడుచుకుంటూ ఆ యుగపురుషుడిని ఒక్కసారి చూడాలని, ఆయన ప్రసంగం వినాలని అధిక సంఖ్యలో హాజరయ్యేవారు. సామాజిక న్యాయాన్ని, సంక్షేమ రాజ్యాన్ని ఉద్బోధించి ఉద్రూతలూగిస్తూ వారిలో ఆవేశం రగిల్చారు. నేడు దేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నిటికీ ఎన్టీఆరే ఆద్యుడు. 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా! కదలి రా!' అంటూ నినదించారు. చైతన్యరథమే వేదికగా జన సముద్రాలను తన ప్రసంగాలతో ఉప్పొంగిస్తూ ఊరడించేవారు. 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' అని పిలుస్తూ ప్రజలను ఉత్సాహపరిచేవారు. తాను అధికారంలోకి రాగానే సంక్షేమ రాజ్యం స్థాపిస్తానని వాగ్దానం చేసి మాట నిలుపుకున్నారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లంటూ' నినదించారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ ఉద్దండులు, మరోవైపు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని అతి సామాన్య యువత ఎన్టీఆర్ తరపున ఎన్నికల రణరంగంలో నిలిచారు. ఆయన చేసిన ఈ సాహసం రాజకీయ రంగాన్ని ఒక కుదుపు కుదిపింది. 125 మంది పట్టభద్రులు, 28 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 20 మంది డాక్టర్లు, 8 మంది ఇంజనీర్లు, 47 మంది లాయర్లను తన అభ్యర్థులుగా రంగంలోకి దించారు. అభ్యర్థుల సగటు వయసు కూడా 47 సంవత్సరాల లోపే. తన సైన్యంలో యువరక్తానికి, విద్యావంతులకు, మహిళలకు, వెనుకబడిన



వర్గాలకు పెద్దపీట వేశారు. 294 స్థానాలున్న అసెంబ్లీలో 202 స్థానాల్లో తెలుగుదేశం విజయఢంకా మోగించింది. కేవలం 9 నెలల్లోనే పార్టీని స్థాపించి, అధికారం చేపట్టి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకెక్కారు. ఆనాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఎన్టీఆర్‌ను గద్దెదించింది. దీంతో యావత్ దేశం స్పందించింది. దేశవ్యాప్తంగా ప్రజల నిరసనల హోరులో ఢిల్లీ పీఠం దద్దరిల్లింది. ఎన్టీఆర్ నెలరోజుల్లోనే తిరిగి ముఖ్యమంత్రై అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారు. తరతరాలుగా గ్రామాల్లో పెత్తనం చెలాయిస్తూ ప్రజలను పీడిస్తున్న మున్సబు, కరణాలు, పటేల్, పట్వారీ వ్యవస్థలను రద్దు చేశారు. పాలనా వికేంద్రీకరణ ద్వారా ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేయడానికి మండల వ్యవస్థకు దేశంలోనే తొలిసారి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 9 శాతం రిజర్వేషన్లను కల్పించారు. మహిళల కోసం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 20శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుంది. రూ.50కే హార్స్ పవర్ విద్యుత్, వృద్ధాప్య పెన్షన్, తెలుగుగంగ స్థాపన.. రూ.2కే కిలో బియ్యం, పేదలకు పక్కా ఇళ్లు, జనతా వస్త్రాల పథకం లాంటి అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు ఆయన తీసుకున్నారు. జాతీయస్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఒకతాటిపైకి తెచ్చి కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. దానికి ఎన్టీఆర్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. తెలుగుజాతి ఉన్నంతకాలం చరిత్ర పుటల్లో, జన హృదయాల్లో ఆయన చిరస్మరణీయుడుగా ఉంటారు.

# కడపలో అట్టహాసంగా టిడిపి మహానాడు

- జెండా ఆవిష్కరించి ప్రారంభించిన చంద్రబాబు
- తెలుగుదేశం జెండా..జాతికి అండ అన్న అచ్చన్నాయుడు

కడప,మే27( వెలుతురు):

అధికారం చేపట్టిన తొలి ఏడాదిలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కడపలో అట్టహాసంగా ప్రారంభమైంది. కడప అంతటా పసుపుమయమయ్యింది. మూడురోజుల పాటు జరిగే మహానాడుకు టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌తో పాటు, మంత్రులు అచ్చెన్నాయుడు, కేశవ్, అనిత తదితర నేతలుమాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. చంద్రబాబు ఫొటో ప్రదర్శన, రక్తదాన శిబిరాల్ని ప్రారంభించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి , పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం జెండా.. తెలుగు జాతికి అండ అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మహానాడు వేదికపై మంత్రి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల కోసం, తెలుగు రాష్ట్రాల ప్రగతి కోసం టీడీపీ కృషి చేస్తుందన్నారు. పౌరుషాల గడ్డ కడపలో పసుపు జెండా సత్తా చూపించేందుకు తెలుగు దండు కదం తొక్కిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక మహానాడు ఈసారి కడపలో ఘనంగా జరుగుతోందన్నారు. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు నేత నారా లోకేష్ అని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. వైసీపీ భూస్థాపితం అయిపోయిన పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి రాజకీయ భవిష్యత్తు లేదన్నారు. మద్యం, ఇసుక, మైనింగ్ కుంభకోణాలతో జగన్ అండ్ కో టీ-మ్ ప్రజా సంపద దోచుకుందని ఆరోపించారు. వస్తున్నా మీ కోసం అని నాడు చంద్రబాబు భరోసా ఇచ్చారని.. యువగళం పేరుతో తెలుగు ప్రజలకు నారా లోకేష్ అండగా నిలిచారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అలుపెరగని శ్రామికుడు సీఎం చంద్రబాబు అని ఏపీ టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అన్నారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా నిలబడి పోరాడారని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంటే ఉన్నతస్థాయికి వెళ్లొచ్చని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. యువగళం ద్వారా పార్టీకి లోకేష్ కొత్త శక్తి ఇచ్చారన్నారు. చంద్రబాబు, లోకేష్‌ను చూసి క్రమశిక్షణ నేర్చుకోవాలని పల్లా శ్రీనివాస్ వెల్లడించారు. వైసీపీ పాలనలో పార్టీ అధ్యక్షుడి నుంచి కార్యకర్త వరకు అనేక ఇబ్బందులకు గురయ్యారని వివరించారు. వైసీపీ మాదిరిగా గాలికి పుట్టిన పార్టీ కాదని, తమది బడుగు, బలహీనవర్గాల నుంచి పుట్టిన పార్టీ టీడీపీ అని అన్నారు. ఈ పార్టీని ప్రజల నుంచి దూరం చేయాలన్నా ఎవరికీ సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్న టీడీపీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని, ప్రభుత్వం ఏర్పాటుతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని కనబరుస్తున్నారని తెలిపారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. ప్రజల కోసమే టీడీపీ రాజకీయం చేస్తున్నదన్నారు.





## "మానవసేవే మాధవ సేవ" దాసరి రాహుల్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ..




**కూకట్ పల్లి మే 27 వెలుతురు:**
కూకట్ పల్లి భాగ్యనగర్ కాలనీలోని కూకట్ పల్లి ఆంధ్రప్రభ విలేకరి దాసరి రాహుల్ ప్రదీప్ వారి కార్యాలయం వద్ద గత నెల రోజులుగా వారి తల్లిదండ్రులు దాసరి శ్రీనివాస్ రావు, మైనేని ప్రసన్న ల జ్ఞాపకార్థం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఈ కార్యక్రమానికి ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ హాజరై మజ్జిగ, అరటి పండ్లు ను పంపిణీ చేశారు. వారితోపాటు పి ఎల్ ప్రసాద్, పోశెట్టి గౌడ్, కాశీనాథ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాలనీవాసులు, వ్యాపార సముదాయంలో పనిచేసేవారు, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు ప్రతి రోజు 700 నుంచి 900 వందల మంది వరకు మజ్జిగను సేవిస్తున్నారు, ఎండలు తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రయాణికులు మజ్జిగ సేవించి ఉపశమనం పొందుతున్నారు, "మానవ సేవే మాధవ సేవ" మానవత దృక్పథంతో వేసవి పొడవునా మజ్జిగ పంపిణీ చేస్తున్న రాహుల్ ప్రదీప్ ను వారి స్నేహితులు తెల్ల హరికృష్ణ, బుల్లెట్ రవి, రాకేష్, టెన్ టీవీ హరి, అర్జున్, రవీందర్, మహేష్, మారుతి, అనిల్, శంకరయ్య తదితరులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

- జూన్ 9, 10 తేదీలలో రెండు రోజుల శిక్షణ
- జిల్లా జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలి
- విజ్ఞప్తి చేసిన జిల్లా కమిటీ



**కూకట్ పల్లి మే 27 వెలుతురు:**
మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి కి సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి లు వినతిపత్రం అందజేశారు. జూన్ 9, 10 వ తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 50 మంది జర్నలిస్టులకు నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండు రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు ప్రొఫెసర్లతో, సీనియర్ జర్నలిస్టులతో తరగతులు జరుగుతాయని అన్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనాలను మీడియా అకాడమీ ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. రెండు రోజులు శిక్షణ పొందిన వారికి మీడియాకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను కూడా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి అధ్యక్షులు ఎంఏ కరీం, ఉప్పల్ నియోజకవర్గం యూనియన్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు తిరుపతి రెడ్డి, నరోత్తం రెడ్డిలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్..

**కూకట్ పల్లి మే 27 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్ లో 15 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం ఎ.ఇ శ్రావణి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.



కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, రాము, వెంకట్, రఘురాం రెడ్డి, అంజయ్య యాదవ్, చంద్రశేఖర్, పరశురాములు, ఆంజనేయులు వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి హనుమాన్ భక్త బృందం స్వాముల విరాళం...



**కూకట్ పల్లి మే 27 వెలుతురు:**
కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయంలో మండల , అర్థమండల, పావు మండల హనుమాన్ దీక్షలు పాటించిన హనుమాన్ భక్త బృందం స్వాములు ఆలయ అభివృద్ధి కోసం 18,000 రూపాయలను విరాళంగా అందజేశారు. ప్రతి సంవత్సరం ఆలయ ప్రాంగణంలోని కమిటీ హాల్ లో స్వాములు దీక్ష చేసుకునేందుకు అన్ని వసతులను కల్పిస్తూ సహకరిస్తున్న బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ సభ్యులు, ఇతర నేతలకు స్వాములు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం 18 వేల రూపాయల నగదును బస్తీ వెల్ఫేర్ సమక్షంలో ఆలయ కమిటీ అందజేశారు . ఈ సందర్భంగా అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ హనుమాన్ దీక్ష చేపట్టే స్వాములు ఆలయ అభివృద్ధి లో భాగస్వామ్యం పంచుకోవడం అభినందించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేర్ని ధర్మారావు, బస్తి ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, సభ్యులు హనుమంత రెడ్డి, శంకర్ రెడ్డి , తాటి కిరణ్ కుమార్ లతో పాటుగా హనుమాన్ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

## జీవాలకు ప్రభుత్వం ఉచితంగా నట్టల మందులు పంపిణీ చేయాలి

### - రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్

**మే 27 చౌటుప్పల్ న్యూస్ :**
గొర్రెలు మేకలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నట్టల మందులు పంపిణీ చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు.మంగళవారం చౌటుప్పల్ వృత్తిదారుల భవనంలో గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం కొండె శ్రీశైలం అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జీవాలకు ఉదయం పూట మందల వద్దనే ప్రభుత్వ వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీగా ఉందనే సాకుతో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.గొర్రెల మేకల పెంపకందార్ల సమస్యల పరిష్కారం కోసం జియంపియస్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని




హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డైరెక్టర్ బండారు నర్సింహా, జిల్లా అధ్యక్షులు దయ్యాల నర్సింహా,ఉపాధ్యక్షులు బుడమ శ్రీశైలం, కార్యదర్శి మద్దెపురం రాజు, సీనియర్ నాయకులు చేగూరి నర్సింహా, నారి వెంకటేష్, చలమంద రాజు,రాజేష్, జెనిగల యాదయ్య, నెల్లికంటి జంగయ్య,దుర్గం అయిలయ్య, బాలెం శంకరయ్య,గజ్జి పాండు, బీమనబోయిన బాలరాజు, నారి బాలకృష్ణ, రామస్వామి,బద్దుల లింగయ్య పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**వెలుతురు న్యూస్, యాదాద్రి భువనగిరి,చౌటుప్పల్ మే 27 :**
మున్సిపాలిటీ పరిధి చౌటుప్పల్ మండలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని వారు తెలిపారు అమావాస్య అయిన మంగళ వారం రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా మాజీ తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రారంభించి, మాట్లాడుతూ అన్ని దానాల కల్లా అన్నదానం మహా గొప్పది అని అన్నారు అన్నదానం నా చేతుల మీద ప్రారంభించడం నా జన్మ



ధన్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ప్రముఖులు మంచిగంటి భాస్కర్ గుప్తా, సోమారం సత్యగుప్త, కాంసెట్ చంద్రశేఖర్ గుప్తా, పోలాడు వెంకటేష్ గుప్తా, నాంపల్లి శ్రీనివాస్ గుప్తా, దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా, తడకమళ్ళ శ్రీనివాస్ గుప్తా, దాచేపల్లి రాజు, విజయ్ కాంసెట్టి ప్రభాకర్, గజ్జల భాస్కర్, గోరంటి నరసింహరాజు, మంచి కంటి రమేష్, చెరుకు అశోక్, గట్టు రఘు రాములు తదితరులు పాల్గొన్నారు .

## అమెరికాలో బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు...

- సభను జయప్రదం చేయాలని ఎన్నారైలకు పిలుపునిచ్చిన కార్పొరేటర్ రోజా దేవి రంగారావు...



**కూకట్ పల్లి మే 27 వెలుతురు:**
అమెరికా న్యూ జెర్సీ లోని ప్రిన్సన్లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ, డల్లాస్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలు బాల్కా సుమన్, గాదరి కిషోర్, క్రాంతి కిరణ్ చంటి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గ్యదారి బాలమల్లు లతో కలిసి వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారని చావు నోట్ల తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం అలుపెరుగని కృషిచేసి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టి తెలంగాణ ప్రజలు సగర్వంగా తల ఎత్తుకునేలా చేశారని అన్నారు. డల్లాస్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం, బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో ఎన్ఆర్ఐ సోదరులు అందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీ దుర్గా దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనకు మేయర్, సునీత మహేందర్ రెడ్డి లను ఆహ్వానించిన శివ చౌదరి...



**కూకట్ పల్లి మే 27 వెలుతురు:**
కూకట్ పల్లి బాలానగర్ పరిధిలోని ఫతేనగర్ డివిజన్ దీన్ దయాల్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గా దేవి దేవాలయంలో శ్రీ దుర్గా దేవి మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, మల్కాజ్గిరి పార్లమెంటు ఇంచార్జ్ సునీత మహేందర్ రెడ్డి దంపతులను, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గాదె శివ చౌదరి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి వారికి ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దీన్ దయాల్ నగర్ కాలనీ అధ్యక్షుడు పాత విజయభాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ హరి ప్రసాద్ నాయుడు, కాలనీ వాసులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





https://epaper.velthuru.com
హైదరాబాద్ వెలుతురు

# జిల్లాలో 23 వేల 348 మంది రైతుల ఖాతాలలో 238 కోట్ల రూపాయల జమ

- జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 27**

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 320 కేంద్రాలు ద్వారా 23 వేల 348 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 62 వేల 870 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 238 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 140 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు అదనపు బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 358 లారీల ద్వారా 6 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం కరీంనగర్లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 20 మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు దాదాపు 5 కోట్ల రూపాయల నుండి 8 కోట్ల రూపాయలు సంబంధిత రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు ఆటోమెటిక్ యంత్రంతో శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాల వద్దకు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకురావాలని, అకాల వర్షాల సమయంలో కేంద్రాలలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొలతలు పరీక్షించి గ్రేడ్ ఎ, సాధారణ రకాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఓ. ఆర్.ఎస్., గోనె సంచులు, టార్పాలిన్లు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## నెహ్రు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**వెలుతురు న్యూస్, యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్ మే 27 :**

మున్సిపల్ రాజీవ్ స్మారక ట్రస్ట్ భవనంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, రాజీవ్ స్మారక ఫౌండేషన్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎండి ఖయ్యూం, ట్రస్ట్ ఆర్గనైజర్ సెక్రెటరీ నల్ల నరసింహ, ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి సామకూర రాజయ్య, ఐఎన్టీయూసీ డివిజన్ అధ్యక్షులు లగ్గొని వెంకటేష్, పీసీసీ ఆదివాసుల విభాగం కన్వీనర్ ఉండాడి సత్యనారాయణ, ఐఎన్టియుసి మండల ప్రధాన కార్యదర్శి, మహమ్మద్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు .



## చెదరని చిరునవ్వుకు చిరునామా రాధా రాణి

**వనస్థలిపురం వెలుతురు మే 27:**

ఈ నెల 16 వ తారీఖున అనారోగ్యం తో ఓ జోన్ ఆసుపత్రిలో దివంగతులైన రచయిత్రి, గాయని, వక్త అయిన అంకరాజు రాధారాణి గారి పెద్దకర్మ మంగళవారం రోజున వనస్థలిపురం లోని వారి స్వగృహంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అనేకమంది కవులు రచయితలు, సాహితీవేతలు హాజరయ్యారు ఆమె కొన్ని రోజులు టీచర్గా పని చేసింది పాఠశాల స్థాయిలోనే తెలుగు పట్ల అభిమానంతో నేర్చుకొని పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేది కవితలు పాటలు రాసిన వ్యక్తి రాదా రాణి అలాంటి మంచి వ్యక్తి మన మధ్యలో లేకపోవడం విషాదకరం కానీ వారు లేకున్నా వారి సాహిత్యం నాలుకల పైన ఎప్పుడు ఉంటుందని ప్రముఖులు వారిని గుర్తు చేసుకున్నారు ఆమెకు దైవభక్తి అన్నా శ్రీకృష్ణుని పాటలన్నా అమితమైన ప్రేమ ప్రముఖ కవి విశ్లేషకులు శ్రీ రామకృష్ణ చంద్రమౌళి, వంశీ ఆర్ట్స్ వ్యవస్థాపకులు శ్రీ వంశీ రామరాజు, ప్రముఖ సినీ రచయిత్రి శ్రీమతి బలబద్ర పాత్రుని రమణి మొదలైన సాహితీ, కళా రంగ ప్రముఖులు హాజరై ఆమె ఆప్యాయతకి , చెదరని చిరునవ్వుకి చిరునామా అని శ్లాఘిస్తూ సాహితీ లోకానికి ఆమె లేని లోటు ఎవరు తీర్చ లేనిదని అంటూ ఆమెకు నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు.

## భూసమస్యల పరిష్కారంలో సర్వేయర్లు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 27**

భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని లైసెన్స్ సర్వేయర్లు పూర్తిగా తెలుసుకొని ఉండాలని, సమస్యల పరిష్కారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల శ్రీఉషోదయ పాఠశాలలో ఏర్పాటు చేసిన లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా సర్వే, భూరికార్డుల ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూములకు సంబంధించి వివిధ రకాల సర్వే నిర్వహించవలసి ఉంటుందని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రాజెక్టుల సందర్భంగా భూసేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వే వంటి వివిధ సందర్భాలు ఉంటాయని తెలిపారు. సర్వే ప్రక్రియలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని, గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, సరిహద్దు వివాదాల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్వేయర్లకు అందించే శిక్షణ ఎంతో ముఖ్యమని, శిక్షణలో ప్రతి అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలని, చట్టంను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో శిక్షణ కార్యక్రమానికి 162 మంది హాజరు కావలసి ఉండగా 153 మంది హాజరయ్యారని తెలిపారు. ఆధునిక సాంకేతికను వినియోగించుకొని సర్వేలో చిత్తశుద్ధితో పని చేయాలని, సర్వే ప్రక్రియలో ప్రతి చర్యను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 61 వ వర్ధంతి వేడుకలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 27**

పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి 61వ సందర్భంగా భారతదేశ మొదటి ప్రధానిగా ఎన్నో సేవలు చేసినారు ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, మండల కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, గోదాసు సుగ్రీవులు, మొహమ్మద్ నాసర్, నాగులంచ సత్యనారాయణ రావు, మొహమ్మద్ జానీ, కొత్త పెల్లి అబ్రహం కుమార్, గొలుసుల ప్రసాద్, నోముల ప్రవీణ్ కుమార్, యశ్వంత్, మచ్చ గిరి, మొహమ్మద్ దస్తగిరి, పరుశురాములు, వెంకట్ రెడ్డి, మల్లయ్య, రాజేష్, యాదగిరి, నరసింహ, మొహమ్మద్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్ల నారాయణరెడ్డి మృతదేవానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 27**

మండలం వెల్లంకి గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణారెడ్డి తండ్రి ఎడ్ల నారాయణ రెడ్డి ఉదయం చనిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వెల్లంకి గ్రామంలో వారి ఇంటి వద్దకు వెళ్లి నారాయణరెడ్డి పార్థివ మృతదేహానికి నివాళులర్పించి పూలమాలలు వేయడం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, జిల్లా నాయకులు బద్దుల రమేష్, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండి అమీర్, గ్రామ శాఖ అధ్యక్షుడు పున్న వెంకటేశం, కార్యదర్శి పిట్ట మహేందర్, రెడ్డి నాయకులు ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి ,ఎడ్ల రామచంద్ర రెడ్డి, ఈసం ప్రభాకర్ రెడ్డి, ఎడ్ల శ్రీధర్ రెడ్డి, పాశం సతీష్ రెడ్డి, పర్ని కృష్ణారెడ్డి, జింకల అశోక్, ఠాకూర్ రమేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## పీసీసీ నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ గారికి లేఖ రాసిన బీసీ నేత జాజుల లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 27:**

త్వరలో జరగబోయే పీసీసీ రాష్ట్ర కార్యవర్గంలో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ గారికి లేఖ రాసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం పార్టీ పదవుల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం చేయాలని కోరుచున్నాము. పేరుకే సామాజిక న్యాయం అని చెప్తున్నారు కానీ తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు కావడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఒకే ఒక సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఆయన అన్నారు. మంత్రి పదవుల్లో కూడా బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, దోనేటి శేఖర్ పాల్గొన్నారు

## రైస్ మిల్లర్లు నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 27**

రైస్ మిల్లర్లు ఖరీఫ్ 2024-25 సంబంధించి సి.ఎం.ఆర్. డెలివరీ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్మిల్లర్లతో సి.ఎం.ఆర్. డెలివరీ, 2022-23 రబీ ధాన్యం వేలం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ సంబంధించిన సి.ఎం.ఆర్. (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్ ఎ.సి.కె. లక్ష్యాలను సైతం పూర్తి చేసి రబీకి సంబంధించి ధాన్యం ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. సకాలంలో డెలివరీ పూర్తి చేయని పక్షంలో ధాన్యం దెబ్బతినే అవకాశం ఉంటుందని తెలిపారు. మిల్లుల వారిగా పెండింగ్లో ఉన్న లక్ష్యాల వివరాలను తెలిసుకొని అధికారులు, రైస్మిల్లర్లు సమన్వయంతో పని చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2022-23 రబీకి సంబంధించి ధాన్యం వేలంలో వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని, లేని పక్షంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఆర్.ఐ. మురళీకృష్ణ, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి టెంపుల్, కాలనీ ప్రజల అవసరాల కోసం బోర్ వెల్ వేయించిన కేంద్రమంత్రి బండి సంజయ్..

- బండి సంజయ్ కికృతజ్ఞతలు తెలిపిన దేవాలయ కమిటీ బాధ్యులు, కాలనీ ప్రజలు.

**తిమ్మాపూర్ వెలుతురు మే 27:**



తిమ్మాపూర్ మండలం అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయము, స్థానిక కాలనీ ప్రజల నీటి అవసరాల కోసం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ బోర్ వెల్ వేయించారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు, శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చిందం నరసయ్య , బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసి గుడి , స్థానిక కాలనీ ప్రజల నీటి అవసరాల కోసం దేవాలయ, కాలనీ చౌరస్తాలో బోర్ వేయించాలని వినతిపత్రం సమర్పించారు. ఆ సమయంలో తప్పకుండా బోరు వేయిస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు బోర్ వెల్ వేసినందుకు దేవాలయ, కాలనీ అధ్యక్షులు చిందం నరసయ్య , బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర లు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కు దేవాలయ కమిటీ , కాలనీ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు.

# ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలి

### బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాష్ డిమాండ్

**కరీంనగర్ వెలుతురు మే 27:**



పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ పాలకుల తరహాలోనే విద్యార్థులకు కాంగ్రెస్ అన్యాయం చేయాలని చూస్తే రేవంత్ రెడ్డి సర్కార్ గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపులు నిలిపివేసి ముందుగా పేద బడుగు బలహీన విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఇంటర్ డిగ్రీ పీజీ ఇంజనీరింగ్ వృత్తి విద్యా కోర్సుల సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల మంది విద్యార్థులకు గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు చెల్లింపులు నిలిచిపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు.. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాయక, మరి కొంతమంది విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ కొరకు కళాశాలల చుట్టూ తిరుగుతూ మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అదే విధంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల దగ్గర ఫీజుల వసూలు చేయలేక ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ రాక కళాశాల సిబ్బందికి జీతాలు ఇవ్వలేక చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. విద్యార్థుల, కళాశాల యాజమాన్యం లను దృష్టిలో పెట్టుకొని వెంటనే ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. లోగడ టిఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా విద్యార్థులను హరి గోస పెట్టింది ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే పంతాలో కొనసాగుతున్నట్టు కనిపిస్తుందని , అధికారంలోకి వచ్చిన 18 నెల నుండి విద్యార్థుల ఉసురు పోసుకుంటుందని ఘాటుగా విమర్శించారు. రియంబర్స్మెంట్లు రాకపోవడంతో చాలామంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న నాలుగు వేల కోట్ల ఫీజు బకాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఎన్నం ప్రకాష్ డిమాండ్ డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ , మెస్ చార్జీలు, బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులను ప్రభుత్వమే భరించాలని, ప్రైవేటు యూనివర్సిటీలో సామాజిక రిజర్వేషన్లు అమలు చేయాలని. బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అందరినీ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

https://epaper.velthuru.com

హైదరాబాద్ వెలుతురు

# రోడ్లపై శబ్ద కాలుష్యం అరికట్టాలంటూ పోలీసులకు వినతి

- మైనర్ లు వాహనాలు నడుపకుండా చూడాలి
- కాంగ్రెస్ నాయకుడు గుండ్ల మహేందర్ రెడ్డి



**బొల్లారం వెలుతురు మే 27:**



రోడ్లపై వాహనాల శబ్ద కాలుష్యం అరికట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండ్ల మహేందర్ రెడ్డి పోలీసులకు వినతి అందించారు. ట్రాఫిక్ పర్యవేక్షణ చేస్తున్న అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా మైనర్ పిల్లలు వాహనాలు నడుపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బైక్ ల ద్వారా వస్తున్న పెద్ద పెద్ద శబ్దాలను గుర్తించి బైక్ లను సీజ్ చేయాలని ఆయన ఆ విజ్ఞప్తి లో కోరారు. మహిళలు జనాలున్న చోటే పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ఉన్నారని, బొల్లారం లో బైక్ ల కారణంగా శబ్ద కాలుష్యం రోజురోజుకూ పెరుగుతుందని అందులో పేర్కొన్నారు. బైకులను నడిపే యువకులు , ఒకే బైక్ పై ముగ్గురు, నలుగురు వెళ్తూ పటాకులు పేల్చినట్టుగా పెద్ద శబ్దాలు చేస్తూ ఉన్నారని ఇలాంటి వ్యక్తులకు పోలీస్ కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని. అసలు బైక్ నుండి ఎక్కువ శబ్దాలు, పటాకులు శబ్దాలు ఎలా వస్తున్నాయో గుర్తించాలని, సైలెన్సర్ లో పేలినట్టుగా బైకులు నడుపుతూ రాత్రిపూట వెళుతున్నారు కాబట్టి ఈ శబ్ద కాలుష్యం చేస్తున్న యువకులను, మైనర్ పిల్లలు నడుపుతున్న వాహనాలు గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వారి తల్లిదండ్రులని పిలిపించి మాట్లాడాలని కౌన్సిలింగ్ ఇచ్చి, బైకులు సీజ్ చేయాలని ఆయన పోలీసులను కోరారు.

# పంచాయతీ కార్యదర్శుల పై వేధింపులు మానుకోవాలి



**మునుగోడు, మే 27 ( వెలుతురు):**

మునుగోడు మండల ఇన్చార్జి ఎంపిడిఓ విజయ్ భాస్కర్ వివిధ గ్రామాల కార్యదర్శుల మీద ఎస్సీ, ఎస్టీ, బీసీ, వెనుకబడిన సామాజిక కార్యదర్శిల మీద కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోలుగురి నరసింహ,రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో కార్యదర్శులపై ఇంచార్జ్ ఎంపిడిఓ విజయ్ భాస్కర్ చేస్తున్న కక్షసాధింపులకు వ్యతిరేకంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ గ్రామాలలో గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న అనగారిన వర్గాలకు చెందిన కార్యదర్శుల పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఎక్కడా లేని విధంగా ఏ బి సి గ్రేడ్లు చేసి కార్యదర్శులను ఇతర మండలాలకు బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు సిఫారసులు చేయడం సరైంది కాదని మండిపడ్డారు. అదేవిధంగా గ్రామాలలో ఇప్పటివరకు ప్రజా ప్రతినిధిల పాలన లేకున్నా గ్రామ అభివృద్ధి కోసం ఉన్నత అధికారుల ఆదేశాలను పాటిస్తూ నిత్యం కృషి చేస్తున్న కార్యదర్శుల పైన కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, బదిలీలు చేయడం సరైనది కాదని అన్నారు. మునుగోడు మండల కేంద్రంలో పొట్టకూటికోసం రోడ్లమీద చిరు వ్యాపారాలు చేసుకొని జీవనం కొనసాగిస్తున్న వారి మీద ఇంచార్జ్ ఎంపిడిఓ కక్ష సాధింపులు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్,మాజీ జడ్పిటిసి గోసుకొండ లింగయ్య,మండల కార్యవర్గ సభ్యులు ఉప్పునూతల రమేష్, దుబ్బ వెంకన్న,వనం వెంకన్న,మండల కౌన్సిల్ సభ్యులు ఎండీ జానీ,కురుమూర్తి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి

**మునుగోడు, మే 27 (వెలుతురు ):**



దేశ మొదటి ప్రధాని,భారతరత్న అవార్డు గ్రహీత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న నెహ్రూ విగ్రహానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి,మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు ఆరేళ్ల సైదులు, మాజీ ఎంపీటీసీలు జిట్టగోని యాదగిరి,పందుల భాస్కర్,ఎండి అన్వర్, పంతంగి స్వామి, పాలకూరి యాదయ్య, బండారి మల్లేష్, జంగిలి నాగరాజు, ముచ్చపోతుల నర సింహ, తీగల స్వామి, కట్కూరి మహేష్, వరికుప్పల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 15 వరకు ఐటీఆర్ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ,మే27( వెలుతురు):**

ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుపై ఐటీ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను రిటర్నుల దాఖలు తుది గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐటీ- విభాగం కీలక ప్రకటన జారీ చేసింది. నిజానికి 2024-25 ఆదాయపు పన్ను దాఖలు చేసే తుది గడువు ఈ ఏడాది జులై 31తో ముగియనుంది. ఆ గడువును ఐటీ విభాగం తాజాగా సెప్టెంబర్ 15 వరకు పెంచింది. ఐటీఆర్ ఫారాల నోటిఫికేషన్ జారీ ఆలస్యం అయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు- ఐటీ- విభాగం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నోటిఫై చేసిన ఐటీ-ఆర్ ఫారాల్లో చేపట్టిన మార్పులకు అనుగుణంగా సిస్టమ్‌ను సిద్ధం చేయడానికి కొంత సమయం పడుతుందని, ఈ క్రమంలో ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా రిటర్నులు ఫైల్ చేయడం కోసం జులై 31తో ముగియనున్న గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తున్నట్టు- ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది.

# నేడు వనపర్తిలో జనభేరి బహిరంగ సభ

- జనభేరి మోగించి సమస్యలను పరిష్కరించుకుందాం
- జిల్లా ప్రజలకు రాచాల పిలుపు

**వనపర్తి వెలుతురు మే 27:**



ప్రజా సమస్యల పరిష్కారం... హక్కుల సాధనకై బుదవారం నిర్వహిస్తున్న జనభేరి బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జనభేరి బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో తిరిగినప్పుడు వనపర్తి జిల్లా పరిధిలో మా దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి ప్రజల సమక్షంలో తెలపాలనే ఉద్దేశంతో జనభేరి సభను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మరియు గుర్తించిన సమస్యలను ప్రజల ముందు ఉంచుతామని, జనభేరి మోగించి.. ప్రభుత్వంతో సమస్యలను పరిష్కారం చేయించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీసీ మేధావుల ఫోరం అధ్యక్షులు, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు మరియు పలు ప్రజా సంఘాల నాయకులు హాజరవుతున్నారన్నారు. ప్రముఖ జానపద గాయకుడు జంగిరెడ్డి మరియు ఢీ షో విన్నర్ జానులిరి కళాబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పార్టీలు, మతాలు, కులాలకతీతంగా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాచాల విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు చింతపల్లి సతీష్ గౌడ్, పాండురంగ యాదవ్, గోటూరి రవీందర్, వివి గౌడ్, కొన్నూర్ గూడుషా, బత్తుల జితేందర్, దేవర శివ, అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, రాఘవేందర్ గౌడ్, ధర్మేందర్, ఆస్కని రమేష్, అక్కల మల్లేష్ గౌడ్, చెలిమిల్ల రామన్ గౌడ్, యశ్వంత్, శ్రీనివాస్ గౌడ్, రేనట్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం తాజా మాజీ సర్పంచ్లను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయం తీవ్రంగా ఖండిస్తున్నా

*తెలంగాణ సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సురివి యాదయ్య గౌడ్*




**నారాయణపురం వెలుతురు మే 27:**

మంగళవారం రోజున ప్రజా భవన్ ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సురివి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కార్యక్రమం ఈరోజు మంగళవారం ప్రజావాణి కార్యక్రమంలో వినపత్రం అందజేసే కార్యక్రమాన్ని పిలుపునివ్వడం జరిగింది నిన్న రాత్రి నుంచి పోలీసులు సర్పంచ్ల ఇండ్ల దగ్గర కాపువాసి అరెస్టు చేయడం ఇది చాలా దురదృష్టకరం ఎందుకంటే శాంతియుతంగా గాంధీ మార్గంలో పెండింగ్ బిల్లుల పరిష్కారం ప్రభుత్వం చేయాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన పరిష్కారం చేయకపోవడంతో సర్పంచులను అర్ధరాత్రి అరెస్టు చేసి నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పనిచేస్తున్న ప్రభుత్వం అనిపిస్తుంది వినతి పత్రాలు అందజేయడం కూడా ఒక పాపము లాగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుంది ఎంతోమంది సర్పంచులు అభివృద్ధి పనులు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్ది అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు ప్రజా పాలన ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 153 కోట్లు ప్రకటిస్తున్నామని చెప్పి పెండింగ్ బి ల్లులు సర్పంచులకు అందలేదు కేవలం కాంట్రాక్టర్లకు SDF బిల్లులు విడుదల చేసి అవి సర్పంచ్ల పెండింగ్ అనడం అన్యాయం అవివేకం అవాస్తవం ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో తీర్మానాలు ఎంబీ రికార్డ్ చేసి ఏఈ డిఈ





తో రికార్డ్ చేయించి చెక్ మేజర్ చేయించి ఉన్నవి వాటిని వెంటనే గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ SFC నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని పలుసార్లు కోరిన మా పరిష్కారం చూపకపోవడంతో పైగా అరెస్టులు చేయడం సిగ్గుమాలిన చర్య ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీరాజ్ మినిస్టర్ సీతక్క గారు పెండింగ్ బిల్లులపై సమీక్ష సమావేశం పెంచాలని కోరుతున్నాం

# నవయుగ వైతాళికుడు సురవరం

- గోల్కొండ పత్రికతో దురాగతాలపై పోరాటం
- నేడు సురవరం జయంతి

**హైదరాబాద్,మే27( వెలుతురు):**

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు వర్సిటీకి పెట్టడం ద్వారా ఆ మహనీయుడిని గుర్తించుకున్న వారం అయ్యాం. గతంలో సిఎం కెసిఆర్ సహా మంత్రులు తెలువర్సిటీకి పేరు పెడతామని ప్రకటించినా పదేళ్లుగా ఆ మహానుభావుడి గురించి చర్చించుకోలేదు. ఆయన పేరును యూనివర్సిటీకి పెడతామన్న వారు మళ్లీ మాట్లాడ లేదు. జయంతి సందర్భంగా దండలేసి చేతులు దులుపుకోవడంతోనే కాలం గడిచిపోయింది. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం ఆయన పేరును తెలుగు వర్ఇసటీకి పెట్టి ఆయనకు నివాళి అర్పించిందనే చెప్పాలి. సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28న మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాలపాడు గ్రామంలో జన్మించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపకుల్లో ఒకరైన ప్రతాపరెడ్డి తెలుగు లిపిలో ఆవశ్యక సంస్కరణల గురించి విశేష పరిశోధన చేశారు. సాహిత్యం, చరిత్ర, సంస్కృతి మూర్తీభవించిన మహోన్నతుడు ప్రతాపరెడ్డి. తెలంగాణలో సురవరం ప్రతాపరెడ్డి 'గోల్కొండ పత్రిక' స్థాపించి ఎనలేని సేవ చేశారు. ఆనాడు హైదరాబాదులో తెలుగు మాట్లాడే వారే అరుదు. అలాంటి రోజుల్లో ధైర్యంగా తెలుగు పత్రిక స్థాపించి దాని సంపాదకుడిగా బాధ్యతలు నిర్వహించి పత్రికను క్రమం తప్పకుండా వెలువరిస్తూ ఇతోధిక సేవ చేశారు. తన శక్తినంతా ధారపోసి గోల్కొండ పత్రికను నడిపి, తెలంగాణ వాసుల్ని జాగృతం చేసిన మహానుభావుడాయన. తెలంగాణలో కవులులేరు అనే అపప్రథ పోగొట్టడానికి 354 మంది తెలంగాణ కవుల కవితలు, పద్యాలతో 'గోల్కొండ కవుల సంచిక'ను ఆయన వెలువరించారు. ఇది తెలుగు కవితా సంకలనాలలో మణిదీపంగా వెలుగొందు తోంది. తెలంగాణ కవులకు అది ఒక శంఖారావం అయింది. గ్రంథాలయోద్యమ రథసారథుల్లో ప్రతాపరెడ్డి ముఖ్యులు. ఎన్నో సారస్వత విద్యా సంస్థలను నిర్వహించారు. వాల్మీకి రామాయణాన్ని విపులంగా పరిశీలించి ప్రాచ్య, పాశ్చాత్య దృక్పథంతో ఎన్నో చారిత్రక సాంస్కృతిక అంశాలను వివరిస్తూ 'రామాయణ విశేషాలు' అన్న గ్రంథాన్ని రచించారు. అలాగే హిందువుల పండుగలు, వాటి పుట్టుపూర్వోత్తరాలు, చారిత్రక సాంఘిక ప్రాముఖ్యం, ఆచార వ్యవహారాలు, పండుగలలోని పరమార్థం తెలుపుతూ రాసిన పుస్తకం 'హిందువుల పండుగలు' విశేషాదరణ పొందింది. సురవరం ప్రతాపరెడ్డి పేరు చెప్పగానే ప్రతి తెలుగువాడికీ గుర్తుకొచ్చే పుస్తకం 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'. ఇది ఆయన అంతిమ రచన. అత్యంత ప్రశస్తమైన రచన. వేయి సంవత్సరాల సాహిత్య సంపద ఆధారంగా తెలుగు ప్రజల చరిత్రను స్ఫూర్తిదాయకంగా ఆయన వివరించారు. తెలంగాణకు, తెలుగుకు ఎంతో సేవ చేసిన సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగస్టు 25న కీర్తిశేషుడు అయ్యారు. ఆయన సేవలను స్మరించుకుంటున్నా నేటికీ గుర్తుంచుకునే కార్యక్రమం చేపట్టలేదు. తెలంగాణ ఏర్పడ్డ పదేళ్ల తరవాత తెలుగు



విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టి స్మరించుకోవడం స్వాగతించాల్సిన విషయం. తెలుగసాహిత్య చరిత్రలో ఆయనదో పుట ఉంటుందనడంలో సందేహం లేదు.

# జూన్ 2న కవిత కొత్త పార్టీ

- షర్మిల లాగేపాదయాత్రకు సన్నాహాలు
- కెసిఆర్ డైరెక్షన్‌లోనే కవిత కొత్త పార్టీ
- బిజెపి ఎంపి రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

**మెదక్,మే27( వెలుతురు):**

తెలంగాణలో ఎమ్మెల్సీ కవిత పాదయాత్ర చేస్తారని, అలాగే జూన్ 2న కొత్త పార్టీ ప్రకటన చేస్తారని మెదక్ ఎంపి రఘునందన్ రావు తెలిపారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ రాబోతుందని, పార్టీ పెట్టి షర్మిల తరహాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయనుందని అన్నారు. తుఫ్రాన్ లో రఘునందన్ రావు పర్యటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలపై జోస్యం చెప్పారు. మాజీ సిఎం కెసిఆరే కవితతో పార్టీ పెట్టిస్తున్నారని అన్నారు. తండ్రి, కుమార్తె మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. కవిత గెలిచినప్పుడు కెసిఆర్ దేవుడయ్యారని, ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారని విమర్శించారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకని రఘునందన్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



రాసిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనమైంది. ఈ లేఖపై ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతలు తమదైన శైలిలో వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. అలాంటి వేళ మెదక్ ఎంపీ , బీజేపీ నేత రఘునందన్ రావు మరోసారి స్పందించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తండ్రి, కుమార్తెల మధ్య మధ్యవర్తులెందుకని ఆయన సూటిగా ప్రశ్నించారు. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ రాబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం తెలంగాణలో కవిత పాదయాత్ర చేస్తారని ప్రకటించారు. కవిత గెలిచినప్పుడు కేసీఆర్ దేవుడయ్యారని.. మరి ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారంటూ ఎంపీ రఘునందన్ సందేహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ వరంగల్‌లో నిర్వహించారు. ఈ సభకు పార్టీ నేతలతోపాటు- కార్యకర్తలంతా భారీగా తరలి వచ్చారు. అనంతరం ఈ సభలో తన తండ్రి కేసీఆర్ ప్రసంగంతోపాటు- కొన్ని అంశాలతో కూడిన లేఖను ఆయనకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత రాశారు. అయితే ఈ లేఖ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ లేఖను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు తమదైన శైలిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ తర్వాత కేసీఆర్‌తో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ వరుసగా సమావేశమవుతున్నారు. మరోవైపు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ రిజర్వాయర్ నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ కేసీఆర్‌తోపాటు- హరీష్ రావు, ఈటల రాజందర్‌లకు నోటీసులు జారీ అయ్యాయి. జూన్ 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరు కావాలంటూ బీఆర్ఎస్ చీఫ్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ టాపిక్ డైవర్షన్ కోసమే ఈ లెటర్ పాలిటిక్స్ అనే ఓ చర్చ సైతం రాష్ట్రంలో కొనసాగుతోంది.

# జైల్లో ఖైదీలు... భార్యలతో పిక్నిక్...

**జైపూర, మే 27, ( వెలుతురు)**

రాజస్థాన్‌లోని జైపూర్ సెంట్రల్ జైలులోని రఫిక్ బక్రి, భన్వర్ లాల్, అంకిత్ బన్సాల్, కరణ్ గుప్తా అనే ఐదుగురు ఖైదీలు రెగ్యులర్‌గా జరిగే హాస్పిటల్ విజిట్ పేరుతో పిక్నిక్ వెళ్లారు. బ్రేక్ టైంలో వాళ్లు హోటళ్లకు సైతం వెళ్లారు. భార్యలు, గర్ల్‌ఫ్రెండ్స్‌తో చెట్టాపట్టాల్ వేసుకుని పోహా బ్రేక్ ఫాస్ట్ కూడా చేశారు. ఎస్ఎంఎస్ ఆస్పత్రికి వెళ్లేందుకు మెడికల్ చెకప్ అప్రూవల్ తీసుకున్న ఆ నలుగురు ఆ తర్వాత జైలు అధికారులతో కుమ్మక్కై సిటీ అంతా చక్కర్లు కొట్టారు. సాయంత్రం 5.30 నిమిషాల వరకు ఖైదీల్లో ఒక్కరు కూడా జైలుకు తిరిగి రాలేదు. కేవలం ఒకే ఒక్క ఖైదీ మాత్రమే చెప్పినట్లు జైలుకు వచ్చాడు. ఇలా కొన్ని గంటలు బయట స్వేచ్ఛగా తిరిగేందుకు సదరు ఖైదీలు కానిస్టేబుళ్లకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున లంచం కూడా ఇచ్చినట్లు వెలుగులోకి వచ్చింది.దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఐదుగురు కానిస్టేబుళ్లు, నలుగురు ఖైదీలు, నలుగురు బంధువులు సహా మొత్తం 13 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో రఫిక్ భార్య నార్కోటిక్స్ మత్తు పదార్థాలతో పోలీసులకు అడ్డంగా దొరికింది. ఎన్డీపీఎస్ చట్టం కింద ఆమెపై కేసు బుక్ చేశారు. అంకిత్, కరణ్ ఎయిర్‌పోర్టు వద్ద ఉన్న ఓ హోటల్‌లో దొరికారు. వాళ్లు బ్రేక్‌ఫాస్ట్‌గా పోహా తీసుకున్నారు. అంకిత్ గర్ల్‌ఫ్రెండ్ హోటల్‌లో రూమ్ బుక్ చేసినట్లు సమాచారం. హోటల్ వద్ద కరణ్ బంధువు మరొకరు 45 వేల నగదుతో దొరికాడు. అనేక మంది ఖైదీల ఐడీ కార్డులు అతడి వద్ద గుర్తించారు.ఖైదీల పిక్‌నిక్‌కు రూ.25 వేలు ఖర్చయ్యాయని, ఓ మధ్యవర్తి వారికి కావల్సిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీనియర్ అధికారి తెలిపారు. జైలు లోపల నుండే ఓ దోపిడీ దొంగ ఈ వ్యవహారానికి పథకం పన్నినట్లు జైలు వర్గాలు తెలిపాయి. జైపూర్ సెంట్రల్ జైలులో ఖైదీలు దొంగచాటుగా ఫోన్లు వాడుతున్నారని, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సహా పలువురు వీఐపీలకు జైల నుంచి 200కిపైగా ఫోన్ కాల్స్ చేసి, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. సవాయి మాన్ సింగ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, జైపూర్ సెంట్రల్ జైలులో అవకతవకపై దర్యాప్తు, సోదాలు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

# రెండు ముక్కలుగా గ్రేటర్ హైదరాబాద్




**హైదరాబాద్, మే 27, ( వెలుతురు)**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను రెండు ముక్కలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనివల్ల అభివృద్ధి ఈజీ అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ మహానగరాన్ని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.అందులో భాగంగా ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధి దాదాపు 625 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్నది. ఇక మిగిలిన మున్సిపాలిటీలను వీలినం చేస్తే జీహెచ్ఎంసీ పరిధి 2వేల చదరపు కిలోమీటర్లకు పెరుగుతుంది. అప్పుడు దేశంలోనే అతిపెద్ద నగరంగా హైదరాబాద్ నిలుస్తుంది. అప్పుడు ఓఆర్ఆర్ వరకు ఉన్న నగరాన్ని ఒక్కటే కార్పొరేషన్ గా ఉంచడమా లేక రెండు భాగాలుగా విభజించడమా అనే విషయంలో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అయితే పరిపాలన సౌలభ్యం కోసం రెండు భాగాలుగా చేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై ఢిల్లీ, ముంబై నగరాల విస్తీర్ణం, ఆ కార్పొరేషన్లు పనిచేసే తీరుపై అధ్యయనం చేయడానికి ఒక బృందం అయా నగరాల్లో పర్యటించేందుకు సిద్ధమైంది. కాగా ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం దాదాపు ఖరారు అయినప్పటికీ మొత్తాన్ని ఒక కార్పొరేషన్ గా ఉంచడమా? లేక రెండుగా విభజించడమా అనేదానిపై చర్చ సాగుతోంది. ఇక మున్సిపాల్ ఎన్నికల కోసం ఓఆర్ఆర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లో డిలిమిటేషన్ (వార్డుల పునర్విభజన) చేమాలని ప్రభుత్వం భావిస్తోంది. దానిలో భాగంగా ఇప్పటికే ఆ ప్రక్రియను మొదలు పెట్టింది. అయితే ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మాత్రం గ్రేటర్ పరిధిలోకి తెచ్చే ఉద్దేశంతో అక్కడ ఎలాంటి డిలిమిటేషన్ మొదలు పెట్టలేదు. మరోవైపు ఓఆర్ఆర్ పరిధిలో, ఓఆర్ఆర్ బయట ఒకే విధమైన అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కు వేర్వేరుగా ఇద్దరు కార్యదర్శులను నియమించారు.గ్రేటర్ ను విస్తరించడంలో భాగంగానే ఇద్దరు సెక్రటరీలను నియమించినట్లు తెలుస్తోంది. ఓఆర్ఆర్ వెంట ఉన్న 51 గ్రామాలను ఓఆర్ఆర్ లోపలి మున్సిపాలిటీల్లో కలుపుతూ గతేడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రేటర్ విస్తరణ తప్పదనే సంకేతాలు ఇచ్చినట్లయింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 158 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో ఓఆర్ఆర్ లోపల 28 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు.. ఓఆర్ఆర్ కు, ఆర్ఆర్ఆర్ కు మధ్య 18 మున్సిపాలిటీలు వాటి అవతల మొత్తం 130 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. అయితే ఢిల్లీని 2012లో పరిపాలన సౌలభ్యం కోసమని నార్త్, సౌత్, ఈస్ట్ అని మూడు భాగాలుగా విభజించి మూడు కార్పొరేషన్లుగా ప్రటించారు. అయితే ఆ తర్వాతా 2022లో తిరిగి మూడింటిని ఒకే కార్పొరేషన్ కిందకు తీసుకువచ్చారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ విస్తీర్ణం ప్రస్తుతం 1,400 చదరపు కిలోమీటర్లు. దీనివల్ల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలు, పారిశుధ్య నిర్వహణ వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. మరొవైపు నగర విస్తీర్ణం వల్ల అభివృద్ధి త్వరిత గతిన సాగుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడాతాయన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే హైదారాబాద్ నగరం , ఢిల్లీ ని ఒకే రీతిన చూడలేమని, దేశానికి ఢిల్లీ రాజధాని కావడంతో పాటు ఓఆర్ఆర్ వరకు ఉన్న హైదారాబాద్ ను చూస్తే అది ఢిల్లీ తక్కువ విస్తీర్ణంలో ఉంటుంది. కనుక గ్రేటర్ హైదరాబాద్ ను రెండు భాగాలుగా విభజిస్తే పారిపాలన సౌలభ్యానికి మంచిదన్న అభిప్రాయం ఉంది. మొత్తాన్ని రెండుగా విభజించడం రెండు ఒకేలా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా త్వరలోనే ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# మేడారం రహదారిలో అడవి దున్నల సంచారం

**తాడ్వాయి, మే 27, ( వెలుతురు)**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం రహదారిలో మంగళవారం అడవి దున్నలు సంచరించాయి. ఉదయం ఏడు గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మల దర్శనానికి వెళ్తున్న భక్తులు మేడారం సమీపంలోని శివరాంసాగర్ చెరువు సమీపంలోకి రాగానే మూడు దున్నలు రోడ్డు దాటుతూ కనిపించగా భక్తులు అవి వెళ్లే వరకు వేచి ఉన్నారు. అయితే గ్రామానికి ఇంత దగ్గరగా అడవి దున్నలు సంచరిస్తూ కనబడడంతో భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అడవి దున్నలను చూసినందుకు సంతోషపడ్డారు. అడవి దున్నలు రోడ్డు దాటుతున్న ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు.

# ప్రభాకర్‌రావుకు షాక్ ఇచ్చిన అమెరికా

**హైదరాబాద్ మే 27, ( వెలుతురు)**

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు అమెరికాలో ఊహించని షాక్ తగిలింది. రాజకీయ శరణార్థిగా గుర్తించాలని 2024, నవంబర్ 29న ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అమెరికా ప్రభుత్వం తోసిపుచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తనపై రాజకీయ కక్షతో కేసు నమోదు చేసిందని, తనకు ఆశ్రయం కల్పించాలని ప్రభాకర్‌రావు వాదించినప్పటికీ, అమెరికా అధికారులు ఈ అభ్యర్థనను నిరాకరించారు. ఈ నిర్ణయంతో, అమెరికాలో చట్టబద్ధంగా నివసించే అవకాశాన్ని కోల్పోయిన ప్రభాకర్‌రావు, డిపోర్టేషన్ భయంతో ఉన్నారు. ఆయన పాస్‌పోర్టును భారత ప్రభుత్వం రద్దు చేయడంతో, అమెరికాలో ఆయన చట్టవిరుద్ధ స్థితిలో ఉన్నారు.తెలంగాణలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో 2018-2023 మధ్య జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టించింది. ప్రభాకర్ రావు నేతృత్వంలోని ఎస్ఐబీ, విపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తుల ఫోన్ కాల్‌లను అనధికారికంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్యకలాపాలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలు కల్పించేందుకు జరిగినట్లు తెలంగాణ పోలీసులు ఆరోపిస్తున్నారు. 2023 డిసెంబర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత, ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో సేకరించిన డేటాను నాశనం చేసేందుకు 42 హార్డ్ డ్రైవ్‌లను ధ్వంసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో డీఎస్పీ డి. ప్రణీత్ రావు, అదనపు ఎస్పీలు ఎన్. భుజంగ రావు, ఎం. తిరుపతన్న, మాజీ డీసీపీ పి.రాధాకిషన్ రావు, ఒక మీడియా ఎగ్జిక్యూటివ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.2024 మార్చి 11న అమెరికాకు పారిపోయినట్లు పోలీసులు నమ్ముతున్నారు. ఆయనపై ఇంటర్‌పోల్ 2024 మార్చి 10న రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది, దీని అమలును అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఏజెన్సీ వేగవంతం చేస్తోంది. తెలంగాణ పోలీసులు అమెరికా ఎంబసీ సహాయంతో ఆయన డిపోర్టేషన్ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రభాకర్ రావు పాస్‌పోర్టు రద్దు కావడంతో, ఆయన అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉన్నారని, ఇది డిపోర్టేషన్ ప్రక్రియను సులభతరం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు. అమెరికా అధికారులకు తెలంగాణ పోలీసులు ఈ కేసు వివరాలతో కూడిన నివేదికను సమర్పించారు, దీనిలో ఆయనపై ఉన్న ఆరోపణలు, ఆధారాలు వివరించారు.ప్రభాకర్ రావు 2025 జూన్ 20 నాటికి నాంపల్లి కోర్టులో హాజరు కావాలని తెలంగాణ కోర్టు ఆదేశించింది. ఒకవేళ ఆయన హాజరు కాకపోతే, ఆయనను ప్రకటిత నేరస్థుడిగా పరిగణించే అవకాశం ఉంది, దీని ఫలితంగా ఆయన ఆస్తులను స్వాధీనం





చేసుకునే అవకాశం ఉంది. ఈ హెచ్చరికను ఆయన ఇంటి తలుపుపై అతికించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో, ప్రభాకర్ రావు తెలంగాణ హైకోర్టులో అరెస్టు నుంచి రక్షణ కోసం దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది, దీని తర్వాత ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన అరెస్టు అనివార్యమని ప్రభుత్వ న్యాయవాదులు వాదించారు, ఎందుకంటే ఆయన విచారణ ఈ కేసు లోతులను వెలికితీసేందుకు కీలకం.తెలంగాణలో రాజకీయంగా సున్నితమైన అంశంగా మారింది, ఎందుకంటే ఇది మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికార దుర్వినియోగ ఆరోపణలను లేవనెత్తింది. ప్రభాకర్ రావు తనపై రాజకీయ కక్షతో కేసు నమోదైందని వాదిస్తున్నప్పటికీ, పోలీసులు ఆయన నేతృత్వంలో జరిగిన అక్రమ సర్వైలెన్స్‌కు సంబంధించిన ఆధారాలను సేకరించారు. ఈ కేసులో అరెస్టయిన ఇతర అధికారుల వాంగ్మూలాలు ప్రభాకర్ రావు ప్రమేయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అమెరికా ఆశ్రయ దరఖాస్తు తిరస్కరణ, పాస్‌పోర్టు రద్దు ఆయన ఎదుర్కొంటున్న చట్టపరమైన ఒత్తిడిని మరింత పెంచాయి. అంతర్జాతీయ సహకారంతో ఆయనను భారత్‌కు తీసుకురావడం విజయవంతమైతే, ఈ కేసు తెలంగాణ రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపవచ్చు.

# వ్యూహమా... వ్యూహాత్మకమా...





**హైదరాబాద్, మే 27, ( వెలుతురు)**

కవిత లేఖ లీక్ వివాదం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లేఖలో కవిత తన తండ్రి కేసీఆర్‌ను బీజేపీపై మృదువైన వైఖరి, పార్టీ నాయకులకు అందుబాటులో లేకపోవడం, కీలక అంశాలపై నిశ్శబ్దం వంటి విషయాలపై విమర్శించారు. ఈ లేఖ బహిర్గతం కావడంతో బీఆర్ఎస్‌లో అసంతృప్తి, ఖండనలు, అనుమానాలు ఊపందుకున్నాయి. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో అంతర్గత సంక్షోభం తీవ్రమవుతున్న తరుణంలో, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ మౌన వ్యూహాన్ని అవలంబిస్తున్నారు. కవిత లేఖ లీక్ వివాదం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లేఖలో కవిత తన తండ్రి కేసీఆర్‌ను బీజేపీపై మృదువైన వైఖరి, పార్టీ నాయకులకు అందుబాటులో లేకపోవడం, కీలక అంశాలపై నిశ్శబ్దం వంటి విషయాలపై విమర్శించారు. ఈ లేఖ బహిర్గతం కావడంతో బీఆర్ఎస్‌లో అసంతృప్తి, ఖండనలు, అనుమానాలు ఊపందుకున్నాయి. కవితకు మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా, ఆమెకు వ్యతిరేకంగా కూడా విశ్లేషణలు వస్తున్నాయి. ఈ సందర్భంలో కేసీఆర్ కామ్ అవడం పార్టీ భవిష్యత్తుపై సందేహాలను రేకెత్తిస్తోందిమే 2, 2025న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్‌కు రాసిన ఆరు పేజీల లేఖ ఇటీవల బహిర్గతమై తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఈ లేఖలో కవిత, ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ వెండి జూబిలీ సభలో కేసీఆర్ ప్రసంగం “పంచ్” లేకుండా ఉందని, బీజేపీపై కేవలం రెండు నిమిషాలు మాత్రమే విమర్శించారని, ఇది పార్టీ బీజేపీతో జట్టు కడతుందనే అనుమానాలకు దారితీసిందని పేర్కొన్నారు. అలాగే, 42% బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ బిల్లు, ఉర్దూ భాషను ప్రస్తావించకపోవడం వంటి అంశాలపై కేసీఆర్ నిశ్శబ్దం వహించారని విమర్శించారు. పార్టీ నాయకులు, క్యాడర్‌కు కేసీఆర్ అందుబాటులో లేరని, ఇది పార్టీలో అసంతృప్తిని పెంచుతోందని కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేఖ బీఆర్ఎస్‌లో అంతర్గత సమస్యలను బహిర్గతం చేసింది. ఆమె విమర్శలు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలు కాక, పార్టీ క్యాడర్, నాయకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ లేఖ లీక్ కావడం వెనుక “పార్టీలోని కొందరు రహస్య శత్రువులు” ఉన్నారని కవిత ఆరోపించడం బీఆర్ఎస్‌లో ఖండనలు, అనుమానాల సంస్కృతిని సూచిస్తుంది. ఈ ఘటన పార్టీలో నాయకత్వ సంక్షోభం, వారసత్వ రాజకీయాలపై చర్చను రేకెత్తించిందికేసీఆర్ రాజకీయ జీవితంలో మౌనం ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉంది. గతంలో ప్రభుత్వ వ్యవహారాల్లో సమస్యలు తలెత్తినప్పుడు, ఆయన మౌనంగా ఉండి, సమయం గడిచిన తర్వాత నిర్ణయం తీసుకుని, అందరూ దాన్ని అంగీకరించేలా చేశారు. అయితే, ప్రస్తుతం బీఆర్ఎస్‌లోని అంతర్గత సంక్షోభం, కవిత లేఖ వివాదంలో ఈ మౌనం పనిచేస్తుందా అన్నది ప్రశ్న. కేసీఆర్ ఈ విషయంలో బహిరంగంగా స్పందించలేదు, పార్టీ నాయకులైన కేటీఆర్, హరీశ్‌రావులను కూడా స్పందించవద్దని సూచించినట్లు తెలుస్తోంది. కవితను కలిసి మాట్లాడే విషయంలోనూ ఆయన తటపటాయిస్తున్నారని సమాచారం. కవిత విషయంలో కేసీఆర్ “వేచి చూద్దాం” వైఖరిని అవలంబిస్తే, అది పార్టీకి నష్టం కలిగించే అవకాశం ఉంది. ఈ మౌనం బీఆర్ఎస్‌ను మరింత బలహీనపరచవచ్చని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కవిత లేఖలో బీజేపీపై కేసీఆర్ మృదు వైఖరిని విమర్శించడం, ఆమె ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆరు నెలలు తీహార్ జైలులో గడపడానికి బీజేపీని బాధ్యులను చేయడం గమనార్హం. ఆమె ఈ లేఖను పార్టీ క్యాడర్, ప్రజల ఫీడ్‌బ్యాక్‌గా వర్ణించినప్పటికీ, దీని లీక్ వెనుక పార్టీలోని కొందరు “రహస్య శత్రువులు” ఉన్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో కవితకు మద్దతుగా కొందరు ప్రచారం చేస్తుండగా, మరికొందరు ఆమెకు కేసీఆర్ కుమార్తెగా తప్ప సొంత గుర్తింపు లేదని, ఆమె సొంత పార్టీ పెడితే కార్పొరేటర్‌గా కూడా గెలవలేరని విమర్శిస్తున్నారు. కవిత లేఖ వెనుక ఆమె ఉద్దేశం పార్టీలో సంస్కరణలు తీసుకురావడమా లేక నాయకత్వంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడమా అన్నది స్పష్టంగా తెలియదు. ఆమె “కేసీఆర్ నాయకత్వమే బీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయం” అని పేర్కొనడం ద్వారా తన విధేయతను చాటినప్పటికీ, లేఖ లీక్ వివాదం ఆమె రాజకీయ భవిష్యత్తుపై అనుమానాలను రేకెత్తిస్తోంది. కొందరు ఆమె సొంత పార్టీ స్థాపించవచ్చని, మరికొందరు ఆమెపై పార్టీ నుండి సస్పెన్షన్ విధించే అవకాశం ఉందని ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు.బీఆర్ఎస్ ఇప్పటికే రాజకీయంగా బలహీనమైన స్థితిలో ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పార్లమెంట్ ఎన్నికల్లో సగం సీట్లలో డిపాజిట్ కోల్పోవడం ద్వారా పార్టీ గత వైభవాన్ని కోల్పోయింది. ఈ తరుణంలో కవిత లేఖ వివాదం పార్టీలోని అంతర్గత విభేదాలను మరింత బహిర్గతం చేసింది. కేటీఆర్‌ను పార్టీ వారసుడిగా సిద్ధం చేస్తున్నట్లు ఊహాగానాలు ఉన్నాయి. ఈ క్రమంలో కవిత సొంత పార్టీ పెడితే, అది బీఆర్ఎస్‌కు మరింత నష్టం కలిగించవచ్చు. ఆమె రాజకీయ ప్రభావం సీమితంగా ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ క్యాడర్‌లో ఆమెకు కొంత మద్దతు ఉంది. ఈ విభేదాలు పార్టీని మరింత బలహీనపరిచి, కాంగ్రెస్, బీజేపీలకు ప్రయోజనం చేకూర్చవచ్చు. కేసీఆర్‌కు కుటుంబం, పార్టీ మధ్య సమతుల్యత సాధించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ఆయన మౌన వ్యూహం ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో విఫలమైతే, బీఆర్ఎస్ మరింత పతనం దిశగా సాగవచ్చు.

# కేబినెట్ విస్తరణకు ముహూర్తం

**హైదరాబాద్, మే 27, ( వెలుతురు)**

తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ మళ్లీ తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే బస చేయడంతో మంత్రి వర్గ విస్తరణ కోసమేనని జోరుగా ప్రచారం జరుగుతోంది. నీతి ఆయోగ్ భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ పెద్దలతో భేటీ అయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జితో చర్చించారు. ఆదివారం రాత్రి సమావేశంలో ఓ నిర్ణయానికి రాలేకపోవడంతో సోమవారం కూడా సీఎం ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది.తెలంగాణ మంత్రి వర్గంలోకి కొత్తగా ఎంతమందికి అవకాశం కల్పించాలనే విషయంలో పార్టీలో చర్చ కొనసాగుతోంది. మంత్రి వర్గ రేసులో మహబూబ్ నగర్ నుంచి శ్రీహరి, నిజామాబాద్ జిల్లా నుంచి పి. సుదర్శన్ రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, కరీంనగర్ జిల్లా నుంచి ఆదిశ్రీనివాస్, మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్ వంటి వారు పోటీ పడుతున్నారు. వీరిలో నలుగురికి మాత్రమే చోటు దక్కే అవకాశం ఉంది.మహిళా కోటాలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరు కూడా కొత్తగా తెరపైకి వచ్చింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వెలమలలో ప్రేమ్ సాగర్ రావు, ఎస్సీలలో గడ్డం వివేక్, ఎస్టీలలో బాలూనాయక్, శంకర్ నాయక్, ఓబీసీ నుంచి వాకాటి శ్రీహరి, విజయశాంతిల పేర్లు ఉణ్నాయి. మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్, ఫహీమ్ ఖురేషీల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే ఒక్కో వర్గం నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం దక్కుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయిఇక హైకమాండ్ పిలుపుతో సీఎం రేవంత్



రెడ్డితో పాటు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తదితర తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై చర్చలు జరిపారు. అయితే ఈ చర్చల్లో మంత్రివర్గ విస్తరణపై చర్చలు కొలిక్కి రాగా.. పిసిసి కార్యవర్గ కూర్పు పై మాత్రం ఇంకా స్పష్టత రానట్టు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యేల నుంచి వచ్చిన వినతులను సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిశీలించిన అధిష్టానం సామాజికవర్గం, జిల్లాల వారీగా పేర్లను ఎంపిక చేసినట్టు సమాచారం. అయితే ఈ జాబితాను ఇవాళ మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనాయకులు ఖర్గే, రాహల్, కేసి వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ సమావేశం తర్వాత మంత్రివర్గంలోని పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.కేబినెట్ విస్తరణ కొలిక్కి వచ్చినా పిసిసి కార్యవర్గంపై మాత్రం ఇంకా చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. పీసీసీ కార్యవర్గ కూర్పులో సామాజిక సమీకరణాలకు కాంగ్రెస్ పెద్దపీట వేనున్నట్టు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సుమారు 70 శాతం అవకాశం కల్పించనున్న కాంగ్రెస్ వర్గాలు చర్చ జరుగుతోంది.

## దూరం ఆధారంగా టోల్...

**ముంబై, మే 27, ( వెలుతురు)**

: కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణాన్ని సరళీకృతం చేసేందుకు కొత్త టోల్ విధానంపై పనిచేస్తోంది. హైవేలపై ట్రాఫిక్ జామ్ కాకుండా టోల్ వసూలు విషయంలో అనేక సంస్కరణలు తీసుకువస్తోంది. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుకు కూడా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో మరో వినూత్న విధానం అందుబాటులోకి తెచ్చిందిదేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌వేలపై అపరిమితంగా ప్రయాణించేందుకు కేంద్రం కొత్త, వినూత్న విధానం అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం కింద, వాహనదారులు వార్షికంగా 3 వేల లఈరీపాయలు చెల్లించి ఏడాదిపాటు టోల్ చెల్లించకుండా ప్రయాణం చేయవచ్చు. ప్రతి టోల్ గేట్ వద్ద విడిగా ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకపోవడం వల్ల, ఈ పథకం వాహనదారులకు సమయం, ఖర్చు ఆదా చేస్తుంది. ప్రస్తుత ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థతో ఈ ప్యాకేజీ అనుసంధానం అవుతుంది, కాబట్టి అదనపు డాక్యుమెంట్లు అవసరం లేదు. ఫాస్ట్‌ట్యాగ్‌ను రీఛార్జ్ చేయడం ద్వారా ఈ సౌలభ్యాన్ని పొందవచ్చు. ఈ విధానం దీర్ఘకాలిక ప్రయాణికులు, వ్యాపారవేత్తలకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.వార్షిక ప్యాకేజీతోపాటు, దూరం ఆధారిత టోల్ విధానం కూడా ప్రవేశపెట్టనుంది. ఈ విధానంలో, 100 కిలోమీటర్ల దూరానికి 50 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. స్థానికంగా తరచూ ప్రయాణించే వాహనదారులు, చిన్న వ్యాపారులు ఈ ఎంపికతో ఆర్థిక భారం తగ్గించుకోవచ్చు. ఈ విధానం టోల్ చెల్లింపుల్లో పారదర్శకతను పెంచడమే కాక, టోల్ గేట్ల వద్ద రద్దీని తగ్గించడానికి దోహదపడుతుంది. అయితే, గతంలో ప్రతిపాదిత 30 వేల రూపాయలతో 15 ఏళ్లపాటు అపరిమిత ప్రయాణం అనే జీవితకాల ఫాస్ట్‌ట్యాగ్ ఆలోచనను ప్రభుత్వం విరమించుకుంది. దీనిని అమలు చేసే అవకాశం లేదని తెలుస్తోంది.ఈ కొత్త టోల్ విధానం జాతీయ రహదారులపై ట్రాఫిక్ జామ్‌లను తగ్గించి, డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని పెంచుతుందని అధికారులు ఆశిస్తున్నారు. ఫాస్ట్‌ట్యాగ్ వ్యవస్థ ద్వారా టోల్ సేకరణ సులభతరం కావడంతో, రహదారి నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు సమకూరుతాయి. ఈ పథకం రాష్ట్రాల సమన్వయంతో త్వరలో అమలులోకి రానుంది, ఇది విజయవంతమైతే రాష్ట్ర రహదారులకు కూడా విస్తరించే అవకాశం ఉంది. ఈ విధానం వాహనదారులకు ఆర్థిక సౌలభ్యం కల్పించడమే కాక, రహదారి రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఈ పథకం అమలులో సాంకేతిక సమస్యలు, రాష్ట్రాల మధ్య సమన్వయం వంటి సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది.

## ఆ నలుగురు వీరేనా

**హైదరాబాద్, మే 27, ( వెలుతురు)**



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎయిర్ పోర్టులో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అసలు కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ ఎవరు? పక్కన ఉన్న దెయ్యాలు ఎవరు? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మాత్రమే కాదు.. గులాబీ పార్టీలో కూడా హాట్ టాపిక్ గా మారింది. గత కొద్ది సంవత్సరాల నుంచి కల్వకుంట్ల కవిత మాత్రమే కేసీఆర్ ను దగ్గర నుంచి చూసి ఉంటారు. ఎందరో నేతలు చూస్తున్నా నిరంతరం కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ పై కవితకు మాత్రమే ఖచ్చితమైన సమాచారం అందుతుంది. కేసీఆర్ ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఉన్నప్పటికీ అక్కడకు వచ్చి ఎవరెవరు కలుస్తున్నారన్న దానిపై కవితకు ఎప్పటికప్పుడు నివేదిక అందించేవారు కూడా లేకపోలేదు. కల్వకుంట్ల కవిత కామెంట్స్ చేసిన కోటరీ, దెయ్యాలు ఎవరన్న దానిపైనే చర్చ జరుగుతుంది. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ లో కోవర్టులను పక్కకు తప్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేసీఆర్ దేవుడని, కానీ ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్నారంటే కవితకు అక్కడ కేసీఆర్ ను ప్రభావితం చేస్తున్నది ఎవరన్నది పక్కాగా తెలిసిన తర్వాత మాత్రమే ఈ వ్యాఖ్యలు చేశారు. తాను రెండు వారాల క్రితం తాను కేసీఆర్‌కు లేఖ రాస్తే, దానిని ఇప్పుడు బయటపెట్టడంపై కూడా కవిత ఆశ్చర్యపోయారు. తనపై కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయన్న కవిత కేసీఆర్ కుమార్తెనైన తాను రాసిన లేఖే బయటికి వచ్చిందంటే పార్టీలో సామాన్యుల పరిస్థితి ఏమిటని కవిత అన్నారంటే దాని వెనక పెద్ద హస్తాలే ఉన్నట్లు ఆమెచెప్పకనే చెప్పారు కల్వకుంట్ల కవిత అనుమానం నలుగురిపైనే ఉనట్లు గులాబీ పార్టీలో చర్చ జరుగుతుంది. ఒకటి తన సోదరుడు కల్వకుంట్ల తారక రామారావు కాగా, రెండో వ్యక్తి కేసీఆర్ మేనల్లుడు హరీశ్ రావు, సంతోష్ తో పాటు పల్లా రాజేశ్వర్ రెడ్డిపైనే అనుమానం ఉన్నట్లు పార్టీలో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. కేసీఆర్ వద్దకు స్వతంత్రగా వెళ్ళి చర్చించే సమయం, వీలు ఈ నలుగురికి మాత్రమే ఉంటుందని కవిత అనుమానంగా చెబుతున్నారు. అందుకే పేర్లు నేరుగా చెప్పకుండా కేవలం దెయ్యాలంటూ అనడంతో నేరుగా వారితో వార్ కు కవిత సిద్ధమయ్యారనే అర్థమవుతుంది. ఈ నలుగురు మాత్రమే తనను కేసీఆర్ కు దూరం చేశారన్న బాధ కూడా కల్వకుంట్ల కవితలో కనపడుతుంది. అందుకే దెయ్యాలంటూ.. కోటరీ అంటూ ఆ నలుగురిని కవిత టార్గెట్ చేశారంటున్నారు. అయితే దీనిపై ఎవరూ స్పందించకపోవడానికి కూడా కవితతో పెట్టుకోవడం ఎందుకని అందరూ మౌనంగా ఉంటున్నారు.

## నాసిరకం రోడ్ల నిర్మాణం వాహనదారుల ఆగచాట్లు

**యాదాద్రి మే 27, ( వెలుతురు)**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్లో నాసిరకం పనులు నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం గా నిలుస్తున్నాయి. పెట్రోల్ బంక్లో డీజిల్ కోసం వెళ్లిన లారీ రోడ్డు కుంగి పల్టీ కొట్టిన ఘటన నాణ్యత లేమి పనులను తేటతెల్లం చేస్తుంది.జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించిన డ్రైనేజీ బ్రిడ్జిపై నుంచి లారీ వెళ్తుండగా, ఒక్కసారిగా కుంగిపోయింది. నాసిరకం పనుల వల్ల వాహనాలు పల్టీ కొట్టడం ఇది మొదటిసారేమీ కాదంటున్నారు స్థానికులు. గతంలో మోటార్ బైక్లు వెళ్లినా కుంగిపోయిన సందర్భాలున్నాయని చెబుతున్నారు. లినాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసిన క్వాలిటీ కంట్రోల్ అధికారుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోంది. నేషనల్ అథారిటీ కావడంతో పట్టించుకునేవారే లేక, ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నాణ్యతలేని పనులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కరీంనగర్ వాసికే మావోయిస్టు పీఠం...

**కరీంనగర్, మే 27, ( వెలుతురు)**



ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి



మావోయిస్టు పార్టీ చీఫ్ నంబాల కేశవరావు పోలీస్ ఎన్ కౌంటర్లో మరణించడంతో ఇప్పుడు తదుపరి చీఫ్ ఎవరు అన్న విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అందులో ముగ్గురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వారిలో మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి, ఆ తర్వాత ఆ పార్టీ సెంట్రల్ మిలిటరీక మిషన్ చీఫ్ గా ఉన్న తిప్పిరి తిరుపతి అలియాస్, వీరిద్దరితో పాటు పార్టీ సైద్ధాంతిక బాధ్యతలు చూస్తోన్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ దేవ్ జి పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియాస్ గణపతి ప్రస్తుత జగిత్యాల జిల్లా సారంగ పూర్ మండలం బీర్ పూర్ లో 1945లో జన్మించారు. ముప్పాళ్ల గోపాల్, శేషమ్మ దంపతులకు జన్మించిన ఆయన సైన్స్ పట్టా పొంది బీఏడీ పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లాలో టీచర్ గా పని చేశారు. ఆ తర్వాత ఆయన పీపుల్స్ వార్ పార్టీలో చేరారు. ఆ పార్టీలో దాదాపు 15 ఏళ్ల పాటు కేంద్ర కమిటీ కార్యదర్శిగా పని చేశారు. 2004లో పీపుల్స్ వార్, మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా విలీనమయి సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించింది. నాటి నుండి 2018 వరకు ఆయన పార్టీ జనరల్ సెక్రటరీగా నాయకత్వం వహించారు. దేశంలోని 13 రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీని బలోపేతం చేసి రెడ్ కారిడార్ ఏర్పాటు చేశారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అత్యంత విధేయత, అద్భుత వ్యూహకర్త, పార్టీకి నిధుల సేకరణలోను విజయవంతమైన నాయకుడిగా మావోయిస్ట్ పార్టీ అతన్ని గుర్తించింది. భారత దేశంలో అత్యంత మోస్ట్ వాంటెడ్ లిస్ట్ లో ఉన్న వ్యక్తి గణపతి. ఇప్పటి దాకా పోలీసులు ఆయన ఆచూకి కనపెట్టిలేని రీతిలో అండర్ గ్రౌండ్ లో గడుపుతున్న వ్యక్తి. 2018 నవంబర్ లో ఆయన అర్థరైటిస్, ఉబ్బసం, మధుమేహం ఇతర వ్యాధుల కారణంగా , మరో వైపు వయో భారం వల్ల పార్టీ నాయకత్వ బాధ్యతల నుండి తప్పుకుని ప్రస్తుతం చత్తీస్ ఘఢ్ఎన్ కౌంటర్లో మరణించిన నంబాల కేశవరావుకు నాయకత్వం అప్పజెప్పారు. పార్టీ ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ గణపతి బాధ్యతలు ఎత్తుకుంటున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు పెద్ద ఎత్తున ఎన్ కౌంటర్లు చేస్తుండటంతో ఆ పార్టీ రక్షణకు ఆయన వ్యూహాలు, అనుభవం పనికి వస్తుందన్న చర్చ సాగుతోంది. అయితే వయో భారం కారణంగా మరో సారి ఆ బాధ్యతలు నిర్వర్తించలేరన్న ప్రచారం మరో వైపు వినబడుతుంది. అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ఉద్యమ బాధ్యతల్లో ఆయన ఉన్నారన్న వార్తలు వస్తున్నాయి.మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి వినిపిస్తున్న మరో పేరు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జి. ఇతను మావోయిస్ట్ పార్టీలో అత్యంత నిపుణుడైన సైనిక నేతగా, గెరిల్లా దాడుల వ్యూహకర్తగా గుర్తింపు పొందారు. ఇతను కూడా గణపతి పుట్టిన ప్రాంతమైన జగిత్యాల జిల్లాకు చెందిన వాడే. పీపుల్స్ వార్ గ్రూప్ నడుస్తోన్న 1990లోనే ఉద్యమ పార్టీలో చేరారు తిరుపతి. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ని ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర కీలకమని మవోయిస్టు చరిత్ర చెబుతోంది. పీఎల్ జీఏ తొలి ప్లాటూన్ ఏర్పాటులో తిరుపతి అలియాస్ దేవ్ జి కీలక పాత్ర పోషించారు.



మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ దేవ్ జి

2007లో జరిగిన దంతేవాజ గిదం పోలీస్ స్టేషన్ దాడికి నాయకత్వం వహించింది దేవ్ జీనే. ఈ దాడితో ఆయన పేరు మార్మోగింది. ఆ తర్వాత 2013లో చత్తీస్ ఘఢ్ సుకామా జిల్లా దర్బాలోయలో జరిగిన దాడి దేశ చరిత్రలోనే అత్యంత విషాదంగా చెప్పుకున్న దాడి. ఈ దాడిలో 32 మంది కిపైగా చనిపోయారు.చత్తీస్ ఘఢ్ మాజీ హోం మంత్రి, సల్వాజుడం వ్యవస్థాపకుడు అయిన మహేంద్రకర్మ, నాటి చత్తీస్ ఘఢ్ పీసీసీ చీఫ్ నందకూమర్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి వీసీ శుక్లా కూడా చనిపోయారు. ఈ దాడిని దేవ్ జీ, మల్లోజుల వేణుగోపాల్ రావు కలిసి ప్లాన్ చేసి అమలు చేసినట్లు పోలీసులు చెబుతారు. ఇలా దాడలకు ప్లాన్ చేయడంలోను, దాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో నిపుణిడిగా తిరుపతి అలియాస్ దేవ్ జీకి పేరు ఉంది. గతంలో నంబాల కేశవరావు పని చేసిన మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ కు చీఫ్ గా ప్రస్తుం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జి పని చేస్తున్నారు. నంబాల కేశవరావు మృతితో ప్ార్టీ చీఫ్ గా సైనిక నైపుణ్యం , దళిత సామాజిక వర్గం నుండి ఎదిగిన నేతగా దేవ్ జీకే అవకాశం ఉందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఒక వేళ దేవ్ జీ చీఫ్ గా పార్టీ ఎన్నుకుంటే అతని సారధ్యంలో మావోయిస్టు పార్టీ కేంద్రం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్రంగా స్పందించే దిశగా నడిపిస్తారని మాజీ మావోయిస్టులు చెబుతున్నారు.మావోయిస్టు పార్టీలో సీనియర్ గా మల్లోజుల వేణు గోపాల్ అలియాస్ సోను ఉన్నారు. ప్రస్తుతం పార్టీ కేంద్ర కమిటీలోను, పొలిట్ బ్యూరోలో సభ్యుడిగా ఉన్నారు. ఆజాద్ మరణం తర్వాత కేంద్ర కమిటి అధికార ప్రతినిధి బాధ్యతలను మల్లోజుల వేణు గోపాల్ నిర్వర్తిస్తున్నారు. ఈయన తెలంగాణ లోని పెద్ద పల్లి జిల్లా లో జన్మించారు, వెంకటయ్య, మధురమ్మకు ముగ్గురు కుమారులు, అందులో వేణు గోపాల్ చిన్న వాడు. పెద్ద పల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి ఆ తర్వాత ఐటీఐ లో రేడియో, టీవీ మెకానిజం కోర్సు పూర్తి చేశారు. ఆ తర్వాత ఆ తర్వాత పై చదువులు చదివి ఎంటెక్ లో చేరారు.

ఆస మయంలోనే ఉద్యమంలో చేరారు. ఉద్యమ నేతలు కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పార్టీ పిలుపు మేరకు వేణు గోపాల్ అటవీ బాట పట్టారు. మహారాష్ట్ర గడ్చిరోలి దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీకి నాయకత్వం వహించారు. పశ్చిమ కనుమల్లోని కేరళ నుండి గోవా వరకు పార్టీ విస్తరణలో వేణు గోపాల్ కీలక పాత్ర పోషించారు. 2010లో ఆజాద్ మరణం తర్వాత కేంద్ర కమిటీ అధికార బాధ్యతలు నిర్వర్తించారు. టెక్నాలిజీ వినియోగించే విషయంలో పార్టీని ముందుకు నడిపిన వ్యక్తిగా మల్లోజుల వేణుగోపాల్ కు పేరు. శాటిలైట్ ఫోన్ల వినియోగించే దిశగా పార్టీని తీసుకెళ్లారు.2010లో దంతెవాడ లో సీఆర్పీఎఫ్ బలగాలపై దాడి లో 70 మంది చనిపోయారు. దీని సూత్రదారుల్లో వేణు గోపాల్ ఒకరని పోలీసులు అనుమానిస్తున్నారు. 2013లో చత్తీస్ ఘఢ్ సుక్మ దాడిలో కాంగ్రెస్ నేతల పై దాడి లో దేవ్ జీతో పాటు మల్లోజుల వేణు గోపాల్ ప్రధాన సూత్రదారుడిగా పేరుంది. పార్టీ మిలిటరీ వ్యూహాలు, దాడుల్లో పాల్గొనడమే కాకుండా ఆయనకు పార్టీ సిద్ధాంతల పట్ల అత్యంత పట్టు కలిగిన వ్యక్తిగా పేరుంది. 69 ఏళ్ల వేణు గోపాల్ తదుపరి మావోయిస్ట్ చీఫ్ గా పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ సిద్ధాంతాల పట్ల పట్టు, సీనియారిటీ వంటి అంశాలు కలిసి వస్తుందన్న విశ్లేషణ ఉంది. అయితే వయోభారం, అనారోగ్య సమస్యలు, మతి మరుపు వంటి సమస్యలు ఆటంకం కావచ్చు అన్న చర్చ సాగుతోంది. అయితే ఈ ముగ్గురిలో ఎవరు మావోయిస్ట్ పార్టీ చీఫ్ అయినా.. వారు తెలుగు వారు అందునా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారే.

## ఉస్మానియాలో 1000రూపాయలే అద్దె...

**హైదరాబాద్, మే 27, ( వెలుతురు)**




హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వివాదం కొనసాగుతుండగానే.. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంపై కొత్త వివాదం చెలరేగింది. విద్యార్థి సంఘాలు భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నాయి. ప్రస్తుత వీసీ గత ఇన్‌ఛార్జి వీసీ హయాంలో ఈ కేటాయింపులు జరిగాయని అంగీకరించారు. ప్రొఫెసర్లకు రూ. 40,000 అద్దె వసూలు చేస్తుండగా.. ప్రైవేటు వ్యక్తులకు రూ. 1,000కే కేటాయించడంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంపై సమగ్ర విచారణ జరిపి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదం ఇంకా కొనసాగుతుండగానే.. ఇప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) భూ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించారనే ఆరోపణలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. ఈ విషయంలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.ఓయూలోని ప్రొఫెసర్లకు కేటాయించాల్సిన క్వార్టర్లను కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు కేటాయించి, ఈ ప్రక్రియలో పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. సమగ్ర విచారణకు డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులకు క్వార్టర్స్ ఇవ్వడంపై ఓయూ వైస్ ఛాన్సలర్ ని విచారించగా.. క్వార్టర్లు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. అయితే.. ఈ కేటాయింపులు తన హయాంలో జరగలేదని.. గతంలో ఇన్‌ఛార్జి వీసీగా ఉన్న వ్యక్తి ఈ క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని ప్రస్తుత వీసీ వెల్లడించారు. మినిట్స్ బుక్‌లో ఈ విషయాన్ని తాను కూడా చూసినట్లు పేర్కొన్న ఆయన.. తనకు ఈ విషయంతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.వీసీ వివరణ పట్ల విద్యార్థి సంఘాలు తీవ్రంగా స్పందించాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు క్వార్టర్స్ కేటాయించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓయూ ప్రొఫెసర్లు ఈ క్వార్టర్స్‌లో నివాసముంటే వారి వేతనం నుంచి నెలకు రూ. 40,000 కట్ చేస్తారని, కానీ అదే క్వార్టర్లను ప్రైవేటు వ్యక్తులకు మాత్రం కేవలం రూ. 1,000 కే ఇవ్వడాన్ని విద్యార్థి సంఘాలు తప్పు పడుతున్నాయి. ఈ భారీ వ్యత్యాసం అవినీతికి నిదర్శనమని.. దీనిపై సమగ్ర విచారణ జరిపి, ఈ ఇష్యూకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.వాస్తవానికి.. ఓయూలో ఉన్న క్వార్టర్లు ప్రొఫెసర్లకు కేటాయిస్తే వారి నుంచి రూ. 40,000 అద్దె వసూలు చేస్తున్నారు. బయట ఇదే సౌకర్యాలున్న ఇళ్లకు ఇందులో సగం చెల్లిస్తేనే సరిపోతుండటంతో, అంత మొత్తం చెల్లించడానికి ప్రొఫెసర్లు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో ఆ క్వార్టర్లు ఖాళీగా ఉంటున్నాయి. ఈ ఖాళీలను పూరించడానికి, లేదా వాటి ద్వారా కొంత ఆదాయాన్ని పొందడానికి కొందరు అధికారులు ఈ క్వార్టర్లను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించినట్లు చెబుతున్నారు.అయితే.. ప్రొఫెసర్లకు సైతం తక్కువ అద్దెకు, అంటే మార్కెట్ రేటుకు అనుగుణంగా కేటాయిస్తే వారు ఉండటానికి అవకాశం ఉంటుందని విద్యార్థి సంఘాలు, కొంతమంది ప్రొఫెసర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేసి, యూనివర్సిటీ ప్రయోజనాలను కాపాడాలని.. విద్యార్థుల, ఉపాధ్యాయుల హక్కులను గౌరవించాలని వారు కోరుతున్నారు. ఈ వివాదం ఓయూ ప్రతిష్టను దెబ్బతీసే అవకాశం ఉందని, కాబట్టి దీనిపై పారదర్శకమైన విచారణ జరిపి, దోషులను శిక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి

## ఆ 96 వేల రేషన్ కార్డులు రద్దు

**హైదరాబాద్, మే 27, ( వెలుతురు)**

తెలంగాణ పౌరసరఫరాల శాఖ చేపట్టిన క్షేత్రస్థాయి విచారణలో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఆరు నెలలుగా బియ్యం తీసుకోని రేషన్‌కార్డుల వివరాలను సేకరించగా.. ఏకంగా 96 వేల కార్డులు అనుమానాస్పదంగా తేలాయి. అధికారులు చేపట్టిన విచారణలో మే 22 వరకు మొత్తం 6 వేలకు పైగా రేషన్ కార్డులు అర్హత లేనివిగా గుర్తించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డే ప్రాథమికంగా ఉండటంతో.. భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ అవకాశాన్ని కొందరు అనర్హులు సద్వినియోగం చేసుకుని అక్రమంగా రేషన్‌కార్డులు పొందుతున్నారని తెలుస్తోంది. మే మొదటి వారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 90.71 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. వాటి పరిధిలో 2.93 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా. వీరి కోసం ప్రభుత్వం ప్రతి నెలా 1.90 లక్షల టన్నుల బియ్యాన్ని డీలర్లకు పంపిస్తోంది.సన్న బియ్యం పథకం అమలు అయిన తర్వాత ఎక్కువగా నిరుపేదలు రేషన్ తీసుకోవడానికి బారులు తీరుతున్నా.. 1.6 లక్షల మంది మాత్రం పత్తాలేకుండా పోయారు. ఎక్కడా వారు రేషన్ తీసుకుంటున్నట్లు రికార్డులు లేవు. దీంతో.. పౌరసరఫరాల శాఖ వారి జాబితా తీసి.. ఆయా మండలాల్లో తహసీల్దార్ల ద్వారా క్షేత్రస్థాయి విచారణ చేయిస్తోంది. లబ్ధిదారులు సదరు చిరునామాలో నివసిస్తున్నారా, లేదా మరణించారా అని పరిశీలిస్తున్నారు. విచారణలో.. వందేళ్ల వయస్సు పైబడి చనిపోయినవారు కూడా రేషన్ లబ్ధిదారుల జాబితాలో పెద్ద సంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు. మరికొందరికి రెండు వేర్వేరు కార్డుల్లో పేర్లున్నట్లు కూడా సమాచారం. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయానికి పంపిస్తున్నారు.రేషన్‌కార్డుల విచారణలో సూర్యాపేట జిల్లా



100 శాతం విచారణను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత కామారెడ్డిలో 83 శాతం, సిరిసిల్లలో 68 శాతం, కరీంనగర్‌లో 63 శాతం విచారణ పూర్తయ్యింది. అయితే.. 12 జిల్లాల్లో మాత్రం ఈ విచారణ ఇంకా మొదలే కాలేదు. ఇప్పటివరకు జరిగిన విచారణలో, కామారెడ్డిలో 726, సిద్దిపేటలో 519, ఖమ్మంలో 371, సిరిసిల్లలో 360, కరీంనగర్‌లో 330, యాదాద్రిలో 176, మెదక్‌లో 106 కార్డులు అనర్హమైనవిగా తేలాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విచారణ పూర్తయిన తర్వాత.. వరుసగా ఆరు నెలల నుంచి రేషన్ తీసుకోని వారిని.. అర్హత లేకున్నా.. రేషన్ కార్డులు పొందిన వారి కార్డులను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం. ఇది ప్రభుత్వ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి సహాయపడుతుంది. అంతే కాకుండా.. ఈ కేవైసీ చేయించుకోని వారి కార్డులను కూడా తొలగించే అవకాశాలు ఉన్నాయి.

# సౌత్ కు పెద్ద దిక్కుగా పవన్

**న్యూఢిల్లీ, మే 27, ( వెలుతురు)**



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. జాతీయస్థాయిలో సైతం పవన్ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. ఇదంతా 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏకపక్ష గెలుపుతోనే సాధ్యమైంది. తాను గెలవడమే కాకుండా టిడిపి కూటమిని అధికారంలోకి తెచ్చారు పవన్. బిజెపిని టిడిపి తో జత కలిపారు. ఆ మూడు పార్టీల ఎంపీల బలంతో కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారు. సహజంగానే ఇది పవన్ కు మైలేజ్ ఇచ్చే అంశం కావడంతో.. ఆయన ప్రాధాన్యం పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఎనలేని గౌరవం ఇస్తున్నారు. ఏకంగా పవన్ కళ్యాణ్ ను భోజనానికి పిలిచారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి.. ఏకాభిప్రాయ సాధనకు కూడా పవన్ కళ్యాణ్ ను ప్రధాని నరేంద్ర మోడీ ప్రయోగించడం విశేషం. క్రమేపి పవన్ కళ్యాణ్ ప్రధాని నరేంద్ర మోడీకి రైట్ హ్యాండ్ గా మారిపోయారని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.2024 ఎన్నికలకు ముందు జనసేన ఒక చిన్న ప్రాంతీయ పార్టీ. అంతకుముందు ఎన్నికల్లో ఒకే చోట గెలిచింది. రెండు చోట్ల పోటీ చేసిన పవన్ కళ్యాణ్ ఓడిపోయారు. అప్పటినుంచి పవన్ కళ్యాణ్ను నాయకుడిగా కూడా చూసేవారు కాదు ప్రత్యర్థులు. ఆపై జాతీయస్థాయిలో బిజెపి పెద్దలు లైట్ తీసుకున్నారు. కానీ 2024 ఎన్నికల్లో పవన్ మానియా పనిచేసింది. పవన్ కళ్యాణ్ కీ రోల్ ప్లే చేశారు. ఏపీలో టీడీపీ కూటమి, జాతీయస్థాయిలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారు. అప్పటినుంచి పవన్ కళ్యాణ్ ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. సనాతన ధర్మ పరిరక్షణ వంటి విషయంలో పవన్ దూకుడు వెనుక బిజెపి పెద్దలు ఉన్నారు అన్నది ఒక అనుమానం. పైగా హిందుత్వ వాదాన్ని బలంగా వినిపిస్తుండడంతో పవన్ కళ్యాణ్ ను ఒక తురుపు ముక్కగా వాడుకోవడం ప్రారంభించారు బిజెపి పెద్దలు. 2024 ఎన్నికల తరువాత.. చాలా రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో కూడా పవన్ కళ్యాణ్ బిజెపి తరఫున ప్రచారం చేశారు. ఆయా రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు పాటుపడ్డారు. దీంతో బీజేపీ నేతలు పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక అభిమానాన్ని చాటుకుంటూ వచ్చారు.ముఖ్యంగా ప్రధాని మోదీపవన్ కళ్యాణ్ విషయంలో చూపే అభిమానం చాలా సందర్భాల్లో బయటపడింది. వాస్తవానికి 2024 ఎన్నికలకు ముందే బిజెపితో దోస్తీ కట్టారు పవన్ కళ్యాణ్. కానీ ఎన్నడూ ప్రధాని మోదీని కలిసి ప్రయత్నం చేయలేదు. అయితే ఆ ఇద్దరి నేతల మధ్య బంధం ప్రమాణ స్వీకార సమయంలో బయటపడింది. ప్రధాని మోదీ పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ఆశీర్వదించారు. మెగాస్టార్ చిరంజీవి తో కలిసి ప్రజలకు అభివాదం చేశారు. మరోసారి నీతి ఆయోగ్ సమావేశంలో.. పవన్ కాదు గన్ అంటూ ఆకాశానికి ఎత్తేశారు. మొన్నటికి మొన్న అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు హాజరయ్యారు ప్రధాని మోదీ. ఆ సమయంలో పవన్ ప్రసంగానికి ఫిదా అయ్యారు. ప్రసంగం తర్వాత ప్రత్యేకంగా పిలిచి అభినందించారు. సరదాగా చాక్లెట్ ను అందించి నవ్వులు పంచారు.ఎన్డీఏ పక్ష ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రి సమావేశం ఢిల్లీలో జరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో ఎన్డీఏ పక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు సమావేశానికి హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు గృహప్రవేశం ఉండడంతో.. కేవలం పవన్ కళ్యాణ్ మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో పవన్ కు ప్రధాని అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. తనతో కలిసి భోజనానికి ఆహ్వానించారు. పవన్ తో పాటు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ షిండే, అజిత్ పవర్లను ప్రధాని ఆహ్వానించడంతో వారు.. హాజరయ్యారు. మరోవైపు పవన్ తన ఎక్స్ ఖాతాలో నిజమైన హీరోతో కలిసి భోజనం చేశారంటూ ఆనందం వ్యక్తం చేశారు. ప్రధానిని నిజమైన హీరో గా పోల్చడంతో.. పవన్ కళ్యాణ్ జాతీయస్థాయిలో కూడా ఆకర్షించగలుగుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రధాని మోడీకి కుడి భుజంగా మారిపోయారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ముందుడబ్బులు ఎవరిస్తారు... ఇందిరమ్మ లబ్దిదారుల ప్రశ్నలు...

**మెదక్, మే 27 ( వెలుతురు)**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ఊపందుకోవడం లేదు. డబ్బులేని కారణంగా.. నిరుపేద లబ్ధిదారులు ముగ్గు పోసుకునేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు గృహ విస్తీర్ణాన్ని 600 చదరపు అడుగులకు పరిమితం చేయడం కూడా ఈ పథకం ప్రగతికి ప్రతిబంధకమవు తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా.. రేవంత్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చింది. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇళ్ల నిర్మాణానికి అనుమతి పత్రాలు పొందిన 47 వేల 235 మంది లబ్ధిదారుల్లో.. ఇప్పటివరకు కేవలం 17 వేల 982మంది మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారు. కొందరు అసలు తమకు ఇళ్లు వద్దని చెబుతున్నారు. సిమెంట్, ఇటుక, స్టీలు వంటి వాటి ధరలు భారీగా పెరగడంతో.. లబ్ధిదారులు పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదు.ఇంటి నిర్మాణం మొదలుపెట్టాలంటే.. కొంత మొత్తంలో అయినా డబ్బు అవసరం. బేస్మెంట్ వరకు కట్టాలంటే కనీసం లక్షా యాభైవేల వరకు ఖర్చవుతుంది. బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తయ్యాకే లక్ష రూపాయల బిల్లు వస్తుంది. అయితే.. తొలుత లక్షన్నర పెట్టుబడి పెట్టి పనులు ప్రారంభించడం పేదలకు కష్టమవుతోంది. అప్పుచేసి చేసి నిర్మాణం ప్రారంభిద్దామనుకున్నా.. బిల్లులు వస్తాయో, రావోననే ఆందోళన చాలామందిలో ఉంది.ఆర్థికంగా కాస్త మెరుగ్గా ఉన్న లబ్ధిదారులు.. 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఇంటి నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. ఇంత చిన్న ఇల్లు కట్టుకుంటే ప్రయోజనం ఏంటనే అభిప్రాయంతో చాలామంది ఉన్నారు. పిల్లలకు, ఏదైనా ఫంక్షన్లు అయినా అసౌకర్యంగా ఉంటుందనే భావనలో ఉన్నారు. కానీ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 600 చదరపు అడుగులకు మించి ఇల్లు కట్టుకుంటే.. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిగా పరిగణించరని అధికారులు చెబుతున్నారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు.. మంజూరు పత్రం తీసుకున్న 45 రోజుల్లోపు ఇంటికి అవసరమైన మెటీరియల్.. అంటే స్టీలు, సిమెంట్, ఇటుక, ఇసుక, కిటికీలు, తలుపులు సమకూర్చుకోవాలి. ఈ నిబంధన ఇబ్బందికరంగా ఉందని లబ్ధిదారులు చెబుతున్నారు. మార్క్ అవుట్ ఇచ్చాక.. 90 రోజుల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఇదీ సమస్యగానే ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మంజూరు పత్రాలను కూడా వెనక్కి ఇచ్చేస్తున్నారు.సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామాన్ని తొలి విడత పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. మొత్తం 94 మంది లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేశారు. వీరిలో 56 మంది తమకు ఇల్లు వద్దంటూ మంజూరు పత్రాలు వెనక్కి ఇచ్చేశారు. నిర్మాణం ప్రారంభించేందుకు తమ వద్ద డబ్బులు లేని కారణంగానే మంజూరు పత్రాలను వెనక్కి ఇచ్చామని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పైలెట్ గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

# పార్టీకి తలనొప్పిగా మారిన లాలు కొడుకు

**పాట్నా, మే 27, ( వెలుతురు)**



ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి అలాగే కుటుంబం నుంచి కూడా బహిష్కరించారు. ఆయనపై ఇంత కఠిన నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. నిజానికి, తేజ్ ప్రతాప్ యాదవ్ తన ప్రత్యేకమైన వేశధారణ, పూజా ఆచారాలు, వివాదాస్పద వ్యాఖ్యలపై బిహార్ మీడియాలో తరచు నిలుస్తుంటారు. కొంతకాలం క్రితం ఈ సంవత్సరం హెూలీ రోజున, తేజ్ ప్రతాప్ యాదవ్ తన బాడీగార్డ్‌ను హెూలీ మిలన్ సందర్భంగా యూనిఫాంలో డ్యాన్స్ చేయమని ఆదేశించడం తీవ్ర వివాదాస్పదమైంది. ఈ అంశం బిహార్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది.ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సీనియర్ సహాయకుడు జగదానంద్ సింగ్‌తో తేజ్ ప్రతాప్‌కు విభేదాలు ఉన్నట్లు సమాచారం. నిజానికి నాలుగు సంవత్సరాల క్రితం తేజ్ ప్రతాప్ యాదవ్ రాష్ట్రీయ జనతాదళ్ ప్రముఖ నాయకుడు, బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు జగదానంద్ సింగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. జగన్నాథ్ సింగ్ కు వ్యతిరేకంగా ఆయన బహిరంగంగా తన స్వరాన్ని పెంచడమే కాకుండా, జగదానంద్ సింగ్ తో ఆయనకున్న శత్రుత్వం ఆర్జేడీ అగ్ర నాయకత్వాన్ని కూడా చేరేంతగా పెరిగింది. తేజ్ ప్రతాప్ యాదవ్ మద్దతుదారుడు ఆకాశ్ యాదవ్‌ను జగదానంద్ సింగ్ విద్యార్థి ఆర్జేడీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తొలగించి, గగన్ యాదవ్‌ను విద్యార్థి ఆర్జేడీ రాష్ట్ర అధ్యక్షుడిగా చేసినప్పుడు వాస్తవానికి ఈ మొత్తం విషయం వెలుగులోకి వచ్చింది. గగన్ యాదవ్‌ను తేజస్వి యాదవ్ మద్దతుదారుగా పరిగణించేవారు.రెండేళ్ల క్రితం బీహార్‌లో మహా కూటమి ప్రభుత్వం ఉన్నప్పుడు, తేజ్ ప్రతాప్ యాదవ్ పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రిగా ఉన్నారు. అప్పుడు అతను నరేంద్ర మోదీని దేశద్రోహి అని విమర్శించారు. ప్రతిపక్ష ఇండియా అలయన్స్ నాయకులను ప్రధాని మోదీ అహంకారి అని విమర్శించినప్పుడు ఆయన కౌంటర్‌గా ఆ వ్యాఖ్య చేశాడు. ఈ విషయంపై తేజ్ ప్రతాప్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆయన ఒక దేశద్రోహి అని అన్నారు. అప్పుడు బిజెపి తేజ్ ప్రతాప్ యాదవ్‌కు వ్యతిరేకంగా గట్టి నిరసనలు తెలిపింది.2017లో తేజ్ ప్రతాప్ యాదవ్ ప్రధాని మోదీ గురించి అలాంటి ప్రకటన చేయడంపై సర్వత్రా చర్చ జరిగింది. వాస్తవానికి, 2017లో కేంద్ర ప్రభుత్వం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఉన్న %% ప్లస్ భద్రతను తొలగించింది. దీని కారణంగా మొత్తం రాష్ట్రంలో రాజకీయ వివాదం తలెత్తింది. ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే తేజ్ ప్రతాప్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లాలూ జీ హత్యకు కుట్ర పన్నడంలో భాగంగానే ఆయనకు భద్రత తొలగించారంటూ తేజ్ ప్రతాప్ ఆరోపించారు.గత సంవత్సరం తేజ్ ప్రతాప్ యాదవ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యే ముఖేష్ రోషన్‌కు షాకిచ్చారు. నిజానికి గత ఏడాది డిసెంబర్ నెలలో తేజ్ ప్రతాప్ యాదవ్, ముఖేష్ రోషన్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న అసెంబ్లీ స్థానం నుండి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ప్రకటనతో ముఖేష్ రోషన్ ఏకంగా మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్నారు. పార్టీ మనల్ని పొలాలు దున్నమని చెబితే, మనం వెళ్లి పొలాలు దున్నుతామని కూడా ఆయన అన్నారు. తేజ్ ప్రతాప్ యాదవ్ డిసెంబర్‌లో మహువా అసెంబ్లీ నియోజకవర్గ పర్యటనకు వెళ్లారు. అక్కడ మీడియా తేజ్ ప్రతాప్ యాదవ్‌ను మహువా నుంచి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా అని అడిగారు. దీని తర్వాత, తేజ్ ప్రతాప్ యాదవ్ తాను గతంలో మహువా నుండి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, కొంత పని చేశానని చెప్పాడు. ఇక్కడి ప్రజలు కోరుకుంటే, నేను కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేసి మళ్ళీ మహువాలో పని చేస్తాను అని ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత ముఖేష్ రోషన్ ఏడుస్తున్న వీడియో వైరల్ అయింది.వివాహమైన కొన్ని నెలలకే తన భార్య ఐశ్వర్య రాయ్ పై విడాకుల పిటిషన్ దాఖలు చేయడం ద్వారా తేజ్ ప్రతాప్ యాదవ్ లాలూ కుటుంబానికి చాలా అసౌకర్య పరిస్థితిని సృష్టించారు. తేజ్ ప్రతాప్ యాదవ్ 2018 మేలో ఐశ్వర్య రాయ్‌ను వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన కొన్ని నెలల తర్వాత అంటే నవంబర్ 2018లో తేజ్ ప్రతాప్ తన భార్య నుండి విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయం లాలూ కుటుంబానికి సంబంధించినది కాబట్టి దీనిని మీడియాలో రచ్చ రచ్చ అయింది. ఇలా మొత్తంగా పార్టీతో పాటు కుటుంబానికి కూడా పెద్ద తలనొప్పిగా మారిన తేజ్ ప్రతాప్ యాదవ్‌ను లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు సమాచారం.







# పకడ్బందీగా సినిమా హాళ్ల నిర్వహణ

## ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలి

## సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు పవన్ సూచన



రాష్ట్రంలో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని... ఆ దిశగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు..సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన చర్యలను, తాజా పరిణామాలను ఉప ముఖ్యమంత్రికి రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. ఈ సందర్భంగా తెలుగు చిత్ర రంగంలో సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు వెలువడటానికి గల నేపథ్యం, ఆ నలుగురు ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం... తదితర అంశాలు చర్చకు వచ్చాయి. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనక జనసేన నాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు. ఈ ప్రకటన వెనక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలో కూడా విచారణ చేయించాలని పవన్ కళ్యాణ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ అనే ప్రకటన వెనుక గల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఇందుకు కారకుల్లో జనసేన తరఫువాళ్ళు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దన్నారు. నిర్మాతలను కావచ్చు, నటు-లను కావచ్చు, దర్శకులను కావచ్చు... బెదిరింపు ధోరణిలో దారికి తెచ్చుకొని వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వకుండా సినిమా వ్యాపారం సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకువస్తుందని అన్నారు.

# ఛాంబర్ ద్వారానే టిక్కెట్ల పెంపు అభ్యర్థనలు

## నా సినిమా అయినా సరే..వ్యక్తిగతంగా రావద్దు

## డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు



థియేటర్ల మూసివేత అంశంపై పెద్ద రగడ జరుగుతోంది. ఇప్పటికే ఈ అంశంపై పవన్ కల్యాణ్ సీరియస్ గా స్పందించారు. దానిపై ఇప్పటికే అల్లు అరవింద్, దిల్ రాజు కూడా తమకు సంబంధం లేదని క్లారిటీ- ఇచ్చుకున్నారు. పవన్ కల్యాణ్ కే మద్దతు పలికారు. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్ మరోసారి ఘాటు-గా స్పందించారు. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ తాజాగా పవన్ కల్యాణ్ తో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కీలక విషయాలను చర్చించారు. అనంతరం పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు, వ్యాఖ్యలు చేశారు. ఇక నుంచి సినిమా టికెట్ల ధరల పెంపుకోసం వ్యక్తిగతం రావొద్దని తేల్చి చెప్పారు. 'నా సినిమా టికెట్ ధరల పెంపుకోసం అయినా సరే ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే రావాలి. ఇక నుంచి ఎవరూ వ్యక్తిగతంగా రావొద్దు. అలా వస్తేనే సినిమా ఇండస్ట్రీలో ఐక్యత పెరుగుతుంది. హరిహరి వీరమల్లు సినిమాకు అయినా సరే నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే రావాలి. మండలి ద్వారానే వచ్చి అర్జీ పెట్టి సంప్రదింపులు జరపాలి. అంతే గానీ తనమన అనే బేధాలు పాటించొద్దు. ఇక నుంచి ఫిల్మ్ ఇండస్ట్రీలో మనకు అందరూ సమానమే. నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర మండలి ద్వారా వస్తేనే అందరికీ సమాన న్యాయం జరుగుతుంది. ఇందులో ఎలాంటి తారతమ్యాలు లేవు. అందరూ మనకు సమానమే. ఇప్పటి వరకు ఎవరికి ఎలాంటి బేధాలు మేము చూపించలేదు. కాబట్టి ప్రభుత్వంతో అందరూ అలాగే బిహేవ్ చేస్తే బెటర్. టికెట్ల ధరల పెంపుపై కూడా పునరాలోచనలు చేస్తాం. ఎలా పడితే అలా పెంచకుండా ఒక నిర్దిష్ట స్థాయిలోనే ధరలు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తాం అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# పుష్ప పాత్రను మిస్ చేసుకున్నా


## - నారా రోహిత్



నారా రోహిత్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నారా చంద్రబాబు నాయుడు తమ్ముడు నారా రామమూర్తి నాయుడు కుమారుడైన రోహిత్ సినిమాల మీద ఆసక్తితో ఎప్పుడో బాణం అనే సినిమాతో హీరోగా లాంచ్ అయ్యాడు. ఆ తర్వాత చేసిన సోలో ఇలాంటి సినిమా ఆయనకు మంచి హిట్ వచ్చింది. ఆ తర్వాత చేస్తున్న సినిమాలన్నీ వైవిధ్యంగా ఉన్నా ఎందుకో హిట్స్ అందుకోలేకపోయాడు. అయితే ఆయన తాజాగా భైరవం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాలో ఆయన మంచు మనోజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. మే 30వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో నారా రోహిత్ మీడియాతో ముచ్చటించాడు. ఈ సందర్భంగా అనేక విషయాలు పంచుకున్న ఆయన తాను పుష్ప లాంటి సినిమాను మిస్ చేసుకున్నట్లు- వెల్లడించాడు. తనను పుష్ప సినిమాలోని ఫహద్ ఫాజిల్ క్యారెక్టర్ కోసం ముందు అడిగారని, అయితే మాటలు జరుగుతున్న సమయంలోనే ఆ సినిమాను పాన్ ఇండియా సినిమాగా చేయాలని భావించి ఆ సమయంలో ఫహద్ ఫాజిల్‌ను సంప్రదించారని చెప్పుకొచ్చాడు. ఇక భైరవం సినిమా బాగా కుదిరిందని, తమిళంలో శశి కుమార్ చేసిన పాత్ర తాను ఇక్కడ పోషించానని చెప్పుకొచ్చాడు. కచ్చితంగా భైరవం హిట్ అవుతుందని నమ్మకం ఆయన వ్యక్తం చేశాడు. అలాగే తాను సుందరకాండ అనే సినిమాతో మరో నెల రోజుల్లో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు- వెల్లడించాడు.

# షష్టిపూర్తి ఓ ఫ్యామిలీ డ్రామా

## దర్శకుడు పవన్ ప్రభ వెల్లడి



డా. రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన ప్రధాన పాత్రల్లో రూపేశ్ హీరోగా, నిర్మాతగా మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం 'షష్టిపూర్తి'. ఈ మూవీలో ఆకాంక్ష సింగ్



ప్రధాన పాత్రను పోషించారు. ఈ సినిమాను మే 30న విడుదల చేయబోతోన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు పవన్ ప్రభ మూవీ విశేషాలను మీడియాకు వివరించారు. షష్టిపూర్తి' గురించి చాలా చోట్ల తిరిగాను. ఇళయరాజా గారు కావాల్సిందే అని ముందు నుంచీ ఫిక్స్ అయ్యాను. ఇళయరాజా గారు ఎలా వస్తారు? అని చాలా మంది అంటుండేవారు. ఫ్యామిలీ డ్రామాకు ఎక్కువ క్యాస్టింగ్ కావాల్సి ఉంటుంది. ఇలాంటి చిత్రాలకు డేట్లు- అడ్జస్ట్ అవ్వాలి. షూటింగ్‌కి టైం పడుతుంది. కానీ నేను ఈ సినిమానే చేయాలని ఫిక్స్ అయ్యాను. అందుకే ఇన్నేళ్లు పట్టింది. మాది చాలా పెద్ద ఉమ్మడి కుటుంబం. నాకు అందరి ప్రేమ తెలుసు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిన్నమ్మ, పెద్దమ్మ, మేనత్త ఇలా అందరి మధ్య పెరిగాను. కానీ ఇప్పుడు కొందరికి అమ్మానాన్నలు కూడా బరువు అవుతున్నారు. నడి రోడ్డు మీద వారిని వదిలేస్తున్నారు. అమ్మానాన్నల గొప్పదనాన్ని, ప్రేమ విలువను చెప్పాలనే ఉద్దేశంతోనే 'షష్టిపూర్తి'ని తీశాను. షష్టిపూర్తి' విషయంలో నేను ముందు నుంచీ చాలా క్లారిటీతో ఉన్నాను. రాజేంద్ర ప్రసాద్ గారు, అర్చన గారిని నేను మళ్లీ రెండో టేక్ అని అడగాలంటే ఎంత ధైర్యం కావాలి. ఎందుకు అని వారు ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పేలా, క్లారిటీ- ఇచ్చే స్థాయిలో నేను ప్రిపేర్ అవ్వాలి. అసలు వాళ్లు ఎలా చేయాలో చెప్పే స్థాయిలో నేను ఉండాలి. వాళ్లని యంగ్ లుక్‌లోకి తీసుకెళ్లి.. మళ్లీ ఓల్డ్ లుక్‌లోకి తీసుకు వచ్చాను. ఓ స్ట్రిక్ట్ మదర్ ఎలా ఉంటారో అలానే చూపించాను. ఓ జోవియల్ ఫాదర్ ఎలా ఉండాలో అలా రాజేంద్ర ప్రసాద్ గారిని చూపించాను. పాటల సిట్యువేషన్‌ను తీసేసి కథను చెప్పమని ఇళయరాజా గారు అన్నారు. ఎక్కడ పాట రావాలో నేను చెబుతాను అని ఆయనే చెప్పారు. ఇక ఫస్ట్ కంపోజిషన్ కోసం మళ్లీ వెళ్లాం. సిట్యువేషన్ చెప్పిన వెంటనే హార్మోనియం మీద పల్లవి ప్లే చేసి వినిపించారు. 'ఇది సరిపోతుందా? మీరు ఆశించినట్టుగా ఉందా? ఇంకా ఏమైనా -చేద్దామా?' అని ఇళయరాజా గారు అన్నారు. ప్రతీ పాటకు మాకు ఎన్నో ఆప్షన్స్ ఇచ్చారు. అన్ని పాటల్ని క్షణాల్లో కంపోజ్ చేసి ఇచ్చారు. చైతన్య ప్రసాద్ , రెహమాన్ , కీరవాణి ఈ చిత్రానికి మంచి పాటలు రాశారు. రూపేశ్, ఆకాంక్ష ఇద్దరూ అద్భుతంగా నటించారు. రూపేశ్ కారెక్టర్‌లో చాలా షేడ్స్ ఉంటాయి. ఆకాంక్ష అచ్చమైన తెలుగమ్మాయి పాత్రలో కనిపిస్తారు. ఆమె పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తరువాత ఆమెకు మరింత మంచి భవిష్యత్తు ఉంటుంది. 'షష్టిపూర్తి' అనేది పూర్తిగా కల్పిత చిత్రమే. ఇందులో ఉండే పాత్రల్లా బయట బతకలేరు. రాజేంద్ర ప్రసాద్ గారు పోషించిన పాత్ర బయట కనిపించదు. ఇలాంటి కథను నమ్మి పెట్టుబడి పెట్టడం అంటే మామూలు విషయం కాదు. మనం కథను చెప్పేటప్పుడు.. మనం ఏం ఫీల్ అవుతామో.. అవతల ఉన్న నిర్మాత కూడా అదే ఫీల్ అయితే సినిమా ముందుకు వస్తుంది. ఇలాంటి చిత్రాల్ని డైరెక్ట్ చేయడం కంటే ప్రొడ్యూస్ చేయడం కష్టం. మంచి ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాగా మా 'షష్టిపూర్తి' రాబోతోంది. కొన్ని రోజుల పాటు- ఈ చిత్రం అందరినీ వెంటాడుతూ ఉంటుంది. నా చిత్రం పెరుగన్నం లాంటిది. సెన్సార్ వాళ్లు మా చిత్రానికి ఒక్క కట్ కూడా చెప్పలేదు.




# కన్నప్ప హార్డ్ డిస్క్ చోరీ

## అందులోనే ప్రభాస్ యాక్షన్ సీన్లు

మంచు విష్ణు హీరోగా తెరకెక్కుతున్న 'కన్నప్ప' సినిమాకు సంబంధించి ఓ కీలక పరిణామం చోటు- చేసుకున్న విషయం తెలిసిందే. కన్నప్ప చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన దృశ్యాలు, డేటా ఉన్న హార్డ్ డ్రైవ్ మాయం అయినట్లు- చిత్రబృందం తాజాగా వెల్లడించింది. దీనికి సంబంధించి ఇప్పటికే 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నిర్మాణ సంస్థ నమ్మక ద్రోహం కేసు కూడా నమోదు చేసింది. సినిమా ఎగ్జిక్యూటివ్ నిర్మాత రెడ్డి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఫిల్మ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలావుంటే మిస్ అయిన హార్డ్ డిస్క్‌కి సంబంధించి కీలక సమాచారం బయటపడింది. ఈ హార్డ్ డిస్క్‌లో సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయని తెలుస్తోంది. దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు ఎటు-వంటి అధికారిక ప్రకటన చేయలేదు. 'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ దాదాపు 30 నిమిషాల పాటు- కనిపించనున్నారని మంచు విష్ణు ఇటీ-వల వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రభాస్ 'రుద్ర' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారని, ఆయన స్క్రీన్-టైమ్ సినిమా కథను మలుపు తిప్పే విధంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతోంది. ముఖ్యంగా, మోహన్ బాబు, ప్రభాస్ మధ్య వచ్చే సన్నివేశాలు అత్యద్భుతంగా ఉంటాయని విష్ణు పేర్కొన్నారు. ప్రభాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు కూడా భారీ అంచనాలు పెట్టు-కున్నారు. ఈ నేపథ్యంలో హార్డ్ డిస్క్ మాయం కావడంతో చిత్ర యూనిట్ తీవ్ర ఆందోళనలో ఉంది. హార్డ్ డిస్క్ బ్యాకప్ పెట్టు-కున్న కూడా.. ఎవరైనా ఆన్‌లైన్‌లో లీక్ చేస్తే.. ఎలా అని చిత్రబృందం ఆందోళన పడుతుంది.




# సినిమా మొత్తం ఆయన మీద నమ్మకంతో బ్లౌజ్ లేకుండా నటించా.. షష్టిపూర్తి నటి కామెంట్స్



రూపేష్ , ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం షష్టిపూర్తి. ఈ సినిమాతో పవన్ ప్రభ దర్శకునిగా పరిచయమవుతుండగా సీనియర్ నటులు రాజేంద్ర ప్రసాద్ , అర్చన కీలక పాత్రల్లో నటించారు.. 'మా ఆయి ప్రొడక్షన్స్' పతాకం పై రూపేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందిస్తున్నాడు.ఈ మూవీ భైరవంకి పోటీగా మే 30న థియేటర్స్‌లోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన పాటలు, ట్రైలర్, టీజర్ అన్ని కూడా ప్రేక్షకులని ఎంతగానో అలరించాయి. ఈ మూవీ కూడా మంచి హిట్ అవుతుందని సినీ ప్రేక్షకులు విశ్వసిస్తున్నారు. అయితే ఈ సినిమాలో నటించిన ఓ సీనియర్ హీరోయిన్ ఛాలెంజింగ్ పాత్ర చేసి అందరిని ఆశ్చర్యపరిచంది. సినిమా మొత్తం బ్లౌజ్ లేకుండా చీరకట్టులో నటించినట్టు తెలిపి అందరిని ఆశ్చర్యపరిచింది. మరి ఆమె ఎవరో కాదు అర్చన. ఈ అమ్మడి గురించి ఇప్పటి జనరేషన్ కు తెలియక పోవచ్చు కానీ తెలుగు సినిమాల్లో క్లాసికల్ గా నిలిచిన సినిమాల్లో నిరీక్షణ చిత్రంలో నటించి అప్పటి సినీ ప్రియులని ఎంతగానో అలరించింది. అయితే నిరీక్షణ తర్వాత అర్చన వెండితెరపై కనిపించింది లేదు. కాని ఇప్పుడు షష్టిపూర్తి అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్ సరసన నటిస్తుంది. అయితే గత కొద్ది రోజులుగా షష్టిపూర్తి సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అర్చన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. నిరీక్షణకి సంబంధించి పలు ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చింది. నిరీక్షణ సినిమాలో గిరిజన యువతి పాత్రలో నటించిన తాను ఆ పాత్రలో నటించేందుకు పెద్ద సాహసమే చేసింది అని చెప్పాలి. అప్పట్లో నేను చీరకట్టుకొని బ్లౌజ్ లేకుండా నటిస్తున్నా అని తెలిసి అందరూ షాక్ అయ్యారు. నేను దర్శకుడిని నమ్మాను.. ఆయన తెరకెక్కించిన సినిమాల్లో ఎక్కడా అశ్లీలత లేకపోవడంతో అతన్ని పూర్తిగా నమ్మి నటించాను అని అర్చన చెప్పుకొచ్చారు. నిరీక్షణ సినిమాకు బాలుమహేంద్రన్ దర్శకత్వం వహించగా, ఈ చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

## సిఎంను కలవడానికి వెళితే అరెస్టులా

- సర్పంచ్‌ల అరస్ట్ అక్రమం: సర్పంచ్‌ల ఫోరమ్

**బచ్చన్నపేట,మే27( వెలుతురు):**
ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని జనగామ జిల్లా మాజీ సర్పంచ్‌ల ఫోరం బచ్చన్నపేట మండల అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేశామని ప్రభుత్వం పేపర్ ప్రకటనకే తప్ప ఇప్పటివరకు గ్రామపంచాయతీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వచ్చే సర్పంచులను ఎక్కడికి అక్కడ అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అరెస్ట్ అయినవారిలో వడ్డేపల్లి మల్లారెడ్డి, కోనేటి స్వామి, మునిని సునీత రాజు గౌడ్, ఎండీ కలిలా బేగం ఆజాం, తాతిరెడ్డి భవాని శశిధర్ రెడ్డి, పర్వతం మధు ప్రసాద్ తదితరులున్నారు.

## వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కన్నుమూత



**ఖమ్మం,మే27( వెలుతురు):**
వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ గుండెపోటుతో మంగళవారం ఉదయం కన్నుమూశారు. నాలుగు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయన.. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గతవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మదన్ లాల్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మదన్ లాల్ మరణంతో వైరా నియోజకవర్గంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలువురు నేతలు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి వైసీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ- చేసి పరాజయం పొందారు. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ వైరా నియోజకవర్గం ఇంచార్జిగా ఉన్నారు.

## రాజకీయ వ్యవస్థలో కేటీఆర్ అజ్ఞాని

- శకుని పాత్ర పోషిస్తున్న మాజీ మంత్రి
- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్



**హైదరాబాద్,మే27( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో కేటీఆర్ అజ్ఞాని అని,మాజీమంత్రి కేటీఆర్‌పై తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ శకుని పాత్ర పోషిస్తున్నారని మెట్టు సాయి కుమార్ విమర్శించారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని పొదుపుగా మాట్లాడాలని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం గాంధీ భవన్‌లో మెట్టుసాయి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ గురించి పది నిమిషాల పాటు ఆలోచిస్తే.. మీ పార్టీలో ఆ నలుగురు తప్ప ఎవరూ ఉండరని మెట్టు సాయి కుమార్ అన్నారు. తెలంగాణలో కేటీఆర్ భాషలోనే ఆయనకు సమాధానం చెబుతామని మాస్ వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ మత్తులో తెలంగాణ భవన్‌లో కూర్చొని కాంగ్రెస్ ప్రభుత్వం మీద కేటీఆర్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా అని తమ నేతలు చేసిన ఛాలెంజ్‌కి కేటీఆర్ భయపడిపోయారని విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. తెలంగాణను పది సంవత్సరాల పాటు కొరివిదెయ్యంలాగా పీల్చుకొని తిన్నది మీరు కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ దెయ్యంలాంటిదని కేటీఆర్ అంటున్నారని.. ఆయన సోదరి కవిత దెయ్యం అనే పదం వాడింది..నీ గురించా, నీ మామ గురించా మీకే తెలియాలని అన్నారు. దెయ్యం, శకుని అన్ని బీఆర్ఎస్‌లోనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చేసిన అరాచకాలను ఇంకా తెలంగాణ ప్రజలు మర్చిపోలేదని అన్నారు. కేసీఆర్ యువజన కాంగ్రెస్ నాయకుడిగా గతంలో పనిచేశారని.. ఈ విషయం కేటీఆర్ తెలుసుకోవాలని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి కొట్టిన దెబ్బకు బీఆర్ఎస్ అధో పాతాళానికి పోయిందని విమర్శించారు. దివంగత నేత వైఎస్సార్‌ని ఆదర్శంగా తీసుకొని రేవంత్‌రెడ్డి స్వర్ణయుగం లాగా తెలంగాణను పాలిస్తున్నారని మెట్టుసాయి కుమార్ పేర్కొన్నారు.

## 20కోట్ల అప్పు తీర్చలేక అవస్థలు

- వ్యక్తి సహా ఏడుగురు కుటుంబ సభ్యుల ఆత్మహత్య



**న్యూఢిల్లీ,మే27( వెలుతురు):**
హర్యానాలోని పంచకులలో ఏడు మంది విషం తాగి కారులో బలవన్మరణానికి పాల్పడిన విషయం కలకలం రేపింది. ప్రవీణ్ మిట్టల్ అనే వ్యక్తికి చెందిన కుటుంబం ప్రాణాలు కోల్పోయింది. అయితే ఆ ఫ్యామిలీ సుమారు 20 కోట్ల అప్పు చేసినట్లు తెలుస్తోంది. ప్రవీణ్ మిట్టల్‌తో పాటు- ఆయన భార్య, తల్లిదండ్రులు, ముగ్గురు పిల్లలు కారులో సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డారు. సూసైడ్ నోట్ రాసి వదిలినట్లు- గుర్తించారు. అంత్యక్రియలను సందీప్ అగర్వాల్ నిర్వహించాలని కోరుతూ ఆ నోట్‌లో తెలిపారు. అయిదు రోజుల క్రితం ఆ వ్యక్తితో ప్రవీణ్ మిట్టల్ ఫోన్‌లో మాట్లాడినట్లు- తేల్చారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రవీణ్ మిట్టల్ కొన్నేళ్ల క్రితం హిమాచల్ ప్రదేశ్‌లోని బద్దిలో చెత్త ఫ్యాక్టరీ పెట్టాడు. రుణం తీర్చని కారణంగా ఆ షాపును బ్యాంకు వాళ్లు కొన్నాళ్లకు సీజ్ చేశారు. తీవ్రమైన అప్పుల్లోకి వెళ్లిన మిట్టల్.. పంచకుల నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లాడు. ఆరేళ్ల పాటు కుటుంబానికి దూరంగా ఉన్నాడు. ఇంటి నుంచి వెళ్లిపోయిన టైంలో మిట్టల్‌కు 20 కోట్ల అప్పు ఉన్నట్లు సందీప్ అగర్వాల్ చెప్పాడు. కొన్నాళ్లు పంజాబ్‌లోని ఖరార్‌కు మకాం మార్చాడు. ఆ తర్వాత హర్యానాలోని పింజోర్‌కు వెళ్లాడు. నెల క్రితమే అతను పంచకులకు మళ్లీ వచ్చినట్లు- తెలుస్తోంది. మిట్టల్ సొంత పట్టణం హిసార్‌లోని బర్వాలా. కొన్నాళ్ల నుంచి పంచకులలోని సాకేత్రి ప్రాంతంలో ట్యాక్సీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. అతని వద్ద ఉన్న రెండు ఫ్లాట్లు-, వాహనాలను ఇటీవల బ్యాంక్ సీజ్ చేసింది. డెహ్రాడూల్‌లో ఉంటున్న మిట్టల్ ఫ్యామిలీ.. సోమవారం భగేశ్వర్ ధామ్ ఆధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లారు. ఆ ఈవెంట్‌కు హాజరై ఇంటికి వస్తున్న సమయంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

# ఈ మహానాడు చరిత్ర సృష్టించబోతోంది

- కడపలో తొలిసారి మహానాడు నిర్వహిస్తున్నాం
- సార్వత్రిక ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేరింగ్ సాధించాం
- ఎన్డీఏతో సంబంధం పెట్టుకోవడం బాగా కలిసి వచ్చింది
- పీక కోస్తున్నా.. జై తెలుగుదేశంఅన్న చంద్రయ్య మనకు స్ఫూర్తి
- మహానాడు వేదికగా అధ్యక్షుడు చంద్రబాబు తొలి పలుకులు





**కడప,మే27( వెలుతురు):**
దేవుని గడపలో జరిగే ఈ మహానాడు చరిత్ర సృష్టించబోతోంది. ఉమ్మడి కడప జిల్లాలో పది స్థానాలకు ఏడు స్థానాలు గెలిచి సత్తా చాటాం. ఈసారి ఇంకాస్త కష్టపడితే పదికి పది స్వీప్ చేస్తాం. కడపలో ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు తెలపడం కోసమే ఈ మహానాడు నిర్వహిస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పసుపు పండుగ మహానాడు మంగళవారం ఉదయం కడపలో ఆరంభమైంది. ప్రాణ సమాణమైన టీడీపీ కుటుంబ సభ్యులందరికీ స్వాగతం అంటూ కడప మహానాడులో సీఎం చంద్రబాబు నాయుడు తన ప్రసంగాన్ని ఆరంభించారు. కడప గడ్డపై తొలిసారి మహానాడు నిర్వహిస్తున్నామని, దేవుని కడపలో జరిగే మహానాడు చరిత్ర సృష్టించబోతోందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేరింగ్ సాధించాం. ఎన్డీఏతో సంబంధం పెట్టుకోవడం వల్ల కూడా మనకు కలిసి వచ్చింది. పార్టీ పని అయిపోయిందని అనుకునే వాళ్లకు.. వాళ్ల పని అయిపోయింది. పాలన అంటే హత్య రాజకీయాలు, వేధింపులు, తప్పుడు కేసులు కాదు. విధ్వంసం పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ప్రశ్నించిన కార్యకర్తలని అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారు. పీక కోస్తునా చంద్రయ్య జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలాడు. ఆయనే మనకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తే పార్టీని నడిపిస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా కార్యకర్తల్లో అదే జోరు. ఏమీ ఆశించకుండా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే విజయం సాధ్యమైందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు.కడపలో ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు తెలపడం కోసమే ఈ మహానాడు నిర్వహిస్తున్నాం అని సీఎం తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో పది స్థానాలకు ఏడు స్థానాలు గెలిచి సత్తా చాటాం అని, ఈసారి ఇంకాస్త కష్టపడితే పదికి పది స్వీప్ చేస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. మహానాడులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 'రాయలసీమలో మహానాడు అంటే తిరుపతిలో ఉండేది. తిరుమల తొలిగడప కడపలో ఈరోజు మహానాడు చేసుకుంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం సభ ప్రారంభమైంది. పార్టీ పని అయిపోయిందని అనుకునే వాళ్లకు.. వాళ్ల పని అయిపోయింది. అని సిఎం చంద్రబాబు అన్నారు. ఉదయం 10 గంటల వరకు ప్రతినిధుల నమోదు కార్యక్రమం జరిగింది. సిఎం చంద్రబాబు పార్టీ సభ్యత్వాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అక్కడ ఏర్పాటు- చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు.

## అవినీతికి పెద్దనోట్లే అడ్డంకి

- రూ.500 నోట్లను రద్దుచేయాలి
- డిజిటల్ లావాదేవీలకు మార్చాలి
- అప్పడే దేశంలో అవినీతి తగ్గుతుంది
- మహానాడు వేదికగా చంద్రబాబు వ్యాఖ్యలు

భారతదేశంలో మళ్లీ పెద్ద నోట్లన్నీ రద్దు చేయాలని ప్రధాని నరేంద్ర మోడీని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. పెద్ద నోట్ల రద్దుతో దేశంలో అవినీతి తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న రూ.500 నోట్లను కూడా రద్దు చేసి.. ఆర్థిక లావాదేవీలను డిజిటల్‌లోకి పూర్తిగా మారిస్తేనే అవినీతిని రూపుమాప వచ్చన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో వాట్సప్ గవర్నర్స్ తీసుకొచ్చాం అని, ఇది ఒక గేమ్ చేంజర్ అని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం అని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తికి ఈ రాష్ట్రంలో భద్రత కల్పిస్తాం అని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కడపలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు 2025లో సీఎం ప్రసంగించారు. అన్నదాతకు రూ.20,000 ఇస్తున్నాం. మూడు విడతలుగా రైతుల అకౌంట్లో నగదు జమ చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు శుభవార్త చెబుతూ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. ప్రతి వ్యక్తికి ఈ రాష్ట్రంలో భద్రత కల్పిస్తాం. ప్రభుత్వ పనితీరు పైన కూడా ఎప్పటికప్పుడు ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపడతాం. పనిచేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. దేశంలో పెద్ద నోట్లు రద్దు చేయండని, డిజిటల్ కరెన్సీ తేవాలని ప్రధాని నరేంద్ర మోడీని కోరా. అన్ని పెద్ద పెద్ద నోట్లు రద్దు చేయాలి, అప్పుడే ఈ దేశంలో పూర్తిగా అవినీతి నశిస్తుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. అమరావతి పూర్తి చేస్తాం. రాయలసీమ సమగ్ర అభివృద్ధి నా బాధ్యత. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలో ఫ్యాక్షన్‌ను అంతం చేశాం. పోయిన ఐదు సంవత్సరాలలో ఇరిగేషన్ కోసం ఒక్క పైసా ఖర్చు పెట్టలేదు. హంద్రీనీవా కాలవ పనులు ఏడదిలో పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం. కడపలో కొప్పర్తి, కర్నూలులో ఓర్వకల్‌ను పారిశ్రామికవాడగా అభివృద్ధి చేస్తా. వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెడతా. దేశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా నిలిపేందుకు నిరంతరం పనిచేస్తాం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

# వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే నోటీసులు

- కెటిఆర్‌కు నోటీసుల వెనక కాంగ్రెస్ కుట్రలు
- మండిపడ్డ సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట,మే27( వెలుతురు):**
కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. అవినీతి విషయంలోనే అద్భుత ప్రగతి సాధిస్తున్నదని ధ్వజమెత్తారు. అన్ని శాఖల్లో కమీషన్లే వారి ఎజెండా అని మండిపడ్డారు. ఏ మంత్రి ఎంత సంపాదించాలి, సీఎం సీటుకు ఎట్లా పోటీపడాలన్న సోయి తప్ప మరొకటి లేదన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి దోచుకునే విషయంలో పోటీపడుతున్నారని చెప్పారు. సూర్యాటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు మరోసారి నోటీసులు, సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని ఖండించారు. ప్రశ్నిస్తున్న వాళ్లకు నోటీ-సులు ఇప్పించి బయపెట్టాలని చూస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ చార్జిషీట్‌లో రేవంత్ పేరును ఈడీ పేర్కొన్నప్పటికీ.. మోదీని కలవడానికి వెల్లాడంటేనే ఆయన బుద్ధి అర్ధమవుతుంది. దీనినిబట్టి రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ దోస్తీ ఎట్లుందో తెలుస్తుంది. రేవంత్ చిల్లర చేష్టలతో రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తున్నాడు. అందాల పోటీలతో ప్రపంచం ముందు తెలంగాణ పరువు తీసిండు. కేటీఆర్‌కు నోటీ-సులిస్తే బయపడతామనుకుంటున్నారా?. ఆనాడు కేటీఆర్ స్వయంగా 8 గంటలు కూర్చుని చెప్పిన విషయం మీకు గుర్తుకులేదా అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కేటీఆర్ క్రేజ్ పెరుగుతుందని రేవంత్ ఏడుస్తున్నది. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఇతర దేశాల ఆహ్వానం మేరకు వెళ్తున్నాడని తట్టుకోలేక పోతున్నారు. వాటికీ హాజరుకాకుండా ఆపాలనే అక్కసుతోనే నోటీసులు ఇచ్చారు. నోటీసులతో చిల్లర డ్రామాలు చేస్తూ మరింత నవ్వుల పాలవుతున్నారు. చిల్లర రాజకీయాలతో బీఆర్ఎస్ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయలేరు. 18 నెలలైనా ఇంకా బీఆర్ఎస్ మీద ఏడుపు తగ్గలేదు. కేసీఆర్ కాళేశ్వరం ఎందుకు కట్టిండో కాంగ్రెస్‌కు అవగాహన లేదు. మన నీళ్లను చంద్రబాబు తీసుకెళ్తుంటే సోయిలేదు. చిల్లర చేష్టలు మానుకొని ఇకనైనా అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిదన్నారు. ప్రోటోకాల్ చూడాల్సిన బాధ్యత ఆఫీసర్ల పని. కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ చిల్లర మూకలకు ఏంపని. కేటీఆర్ క్రేజ్ ఖండాతరాలకు వ్యాపించింది. ఆ ఏడుపుతోనే తమ నాయకుడిపై చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పనికిమాలిన చర్యలతో మరింత అభాసుపాలవుతున్నది. రేవంత్ బాసులనే తరిమికొట్టి తెలంగాణ తెచ్చినోళ్ళం. ఆయన చిల్లర చేష్టలకు భయపడతామా. తస్మాత్ జాగ్రత్త.. ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచేయండని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు ఏసీబీ నోటీసులు సిరిసిల్ల క్యాంప్ కార్యాలయంపై దాడి ఘటనపై మాజీమంత్రి జగదీష్ రెడ్డి ఘాటుగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. అందాల పోటీల నిర్వహణలో విఫలమై ప్రపంచం ముందు తెలంగాణ పరువు పోగొట్టారని, కేటీఆర్ విజన్ ఖండతరాలు పాకుతుంటే ఓర్వలేకే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చేష్టలతో త్వరలో ప్రజల్లో తిరుగుబాటు ఖాయమని, కాంగ్రెస్ పీడను ఎప్పుడు వదిలించుకోవాలని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని జగదీష్ రెడ్డి అన్నారు.

# ప్రశ్నించే వారిపై కేసులు పరిపాటిగా మారింది

- నిర్బంధం ఇలాగే కొరసాగితే ప్రజలే తిప్పి కొడతారు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరిక



**హైదరాబాద్,మే27( వెలుతురు):**
ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్బంధం ఇలాగే కొనసాగితే ప్రజలు తిప్పికొడతారని ఆయన హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జాతీయ అంశాల మీద అనేకసార్లు స్పందించారు.. ఆదానీ బొగ్గు విషయంలో గానీ, ఢిల్లీ నిరసనలో మరణించిన ఉత్తర భారత రైతుల కుటుంబాలను ఆదుకున్నది కేసీఆర్ మాత్రమే.. ఈ తరంతో పాటు-, భవిష్యత్ తరాలకు ఇప్పుడున్న పరిస్థితులకన్నా మెరుగైన జీవనం లభించే విధంగా పాలకుల చర్యలు ఉండాలి.. లేకుంటే చరిత్రలో వారికి స్థానం ఉండదు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ వైఫల్యాలు అన్ని మీడియా సంస్థల వార్తలతోనే తేలిపోయింది. అయినప్పటికి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. యాసంగి కోతలు పూర్తయి వానాకాలం వచ్చినప్పటికి నెలల తరబడి కొనుగోళ్ల పక్రియ కొనసాగుతుంది. ధాన్యం కొనుగోళ్లలో అడ్డగోలుగా కోతలు విధిస్తున్నా రైతుల అభ్యంతరాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. మిల్లర్లను ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోమం టున్నారు.. సీఎం ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదు అంటే అసలు పాలన మీద పట్టుందా..? ప్రశ్నించిన వారిని దబాయిస్తున్నారు.. వారి మీద కేసులు పెట్టి వేధిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధం ఇలాగే కొనసాగితే ప్రజలు తిప్పికొడతారు అని నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో రైతులను వ్యవసాయం విషయంలో, పంటల సాగు విషయంలో ఇక్కడి వాతావరణ పరిస్థితులు వివరించి పంటల మార్పిడిని ప్రోత్సహించాం. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహించాం. 60 లక్షల ఎకరాలలో వరి సాగు నుండి 20 లక్షల వరకు ఇతర పంటల వైపు మల్లాలని చైతన్యం చేశాం. ఉమ్మడి రాష్ట్రంలో 35, 40 వేలు ఎకరాలలో ఉన్న ఆయిల్ పామ్ సాగును 2 లక్షల ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగును పెంచాం. వంట నూనెల కోసం దిగుమతుల మీద ఆధారపడకుండా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తే లక్ష కోట్ల వరకు ఆదా అవుతుందని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాం. ఈ దేశ విశాల ప్రయోజనాల కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి అన్న అంశాలను కేంద్రానికి వివరించాం. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆపరేషన్ కగార్ ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com